
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 2 సెప్టెంబరు 2025







ప్రసంగిస్తున్న హోం మంత్రి అనిత, వేదికపై మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే యరపతినేని, మాజీ ఎమ్మెల్సీ జంగా, కొమ్మాలపాటి



తల్లి, చెల్లి ఉసురుతోనే..
జగన్ ఓటమి

ఈ గడ్డ మీద నిలబడే ఎన్టీఆర్ మాట్లాడారు. ఈ గడ్డ మీద నుంచే చంద్రబాబు ఆత్మగౌరవ యాత్ర ప్రారంభించారు. ఈ గడ్డమీదే నారా లోకేశ్ యువగళం వాణి వినిపించారు. ఇప్పుడు ఇదే గడ్డ మీద నన్ను నిలబెట్టి మాట్లాడించడానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఇంత పెద్ద మహా సభ ఏర్పాటు చేయడం జీవితంలో మర్చిపోలేను.
- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత


బస్సులో జీరో టిక్కెట్ అందజేస్తున్న హోం మంత్రి అనిత



సభకు హాజరైన మహిళలు, కార్యకర్తలు, ప్రజలు

- చంద్రబాబు అరెస్టుతో సైకో పతనం ప్రారంభం
- మహిళల భద్రతకు కూటమి పెద్దపీట
- పల్నాడులో ప్రతి మహిళ ఒక నాగమ్మే
- యరపతినేని సభను జీవితంలో మర్చిపోలేను: హోంమంత్రి అనిత

పిడుగురాళ్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తల్లిని, చెల్లిని మోసం చేసి ఇంట్లో నుంచి గెంటేసిన జగన్ మహిళల ఉసురు తగిలి ఓడిపోయాడని, చివరకు చిన్నాన్న చనిపోయిన సంగతి తేల్చమని చెల్లి సునీత ప్రాధేయపడినా కూడా కనికరం చూపించని దుర్మార్గుడని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శలు గుప్పించారు. గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి విజయోత్సవ సభలో హోం మంత్రి అనిత ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళల ఉసురు తగలబట్టే 11 సీట్లకు పరిమితమై ప్రతిపక్ష హోదాను జగన్ అడుక్కుంటున్నాడని ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో సోషల్ (మిగతా 8వ పేజీలో)



ప్రాజెక్టులకు.. జలకళ

- నాగార్జున సాగర్‌లో 301.36 టీఎంసీలు
- పులిచింతలలో 37.91 టీఎంసీలు
- కొనసాగుతున్న నీటి ప్రవాహం
- 11 లక్షల ఎకరాలకు సాగు నీరు
- అన్నదాతల మోముల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటే బంగారు పంటలే పండుతాయి.. అన్నది నిత్య సత్యం. ఇప్పుడు కృష్ణమ్మ సాగర్ ఆయకట్టులో పరుగులిడుతోంది. పంటల సాగుకు పుష్కలంగా నీటిని అందిస్తోంది. లక్షలాది ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. అన్నదాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జూలై చివరిలో జలాశయానికి ప్రారంభమైన వరద ప్రవాహం నేటికీ కొనసాగుతూనే ఉంది. నాగార్జున సాగర్, దిగువన ఉన్న పులిచింతల జలాశయాలు నిండుకుండల్లా కళకళలాడుతున్నాయి. సాగర్ కుడి కాల్వకు నీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని కుడి కాల్వ ఆయకట్టులోని 11.11 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. వరద ప్రవాహం ఇంకొన్ని రోజులు కొనసాగవచ్చని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

నిండిన నాగార్జున సాగర్..
నాగార్జున సాగర్ జలాశయంలో 96.57 శాతం నీటి నిల్వ ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా, సోమవారం డ్యాంలో నీటి నిల్వ 301.36 టీఎంసీలు ఉంది. 590 అడుగులకు.. 586.2 అడుగుల నీటి మట్టం చేరింది. జలాశయానికి 3,28,037 కూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగుకు, విద్యుదుత్పత్తికి వినియోగిస్తున్న నీటితో కలిపి మొత్తం 3,28,037 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం కుడి కాల్వకు 9,500 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

నిండుగా పులిచింతల..
సాగార్జున సాగర్ దిగువన ఉన్న కేఎస్‌రావు పులిచింతల జలాశయం కూడా పూర్తిస్థాయి నీటి నిల్వతో తొణికిసలాడుతోంది. ఈ జలాశయం కూడా ఆగస్టు రెండో వారంలో నిండింది. అప్పటి నుంచి నేటి వరకు పూర్తిస్థాయి నీటి నిల్వ కొనసాగుతోంది. పులిచింతల పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసీలు కాగా 37.91 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులకు.. 169.68 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయంలోకి నీటి ప్రవాహం 2,89,144 క్యూ సెక్కులు కాగా, 2,76,599 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



పులిచింతల జలాశయం

గృహ ప్రవేశాలకు సిద్ధం చేయండి
- కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం ద్వారా నిర్దేశించిన 11,049 ఇళ్లను నిర్మించి, ఈ నెల 15న లబ్ధిదారులు గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో.. జేసీ భార్గవ తేజతో కలిసి గృహ నిర్మాణం, జిల్లా నీటి ప్రణాళిక, గ్రామ, వార్డు సచివాలయాలు, ఉపాధి హామీ పథకం, స్వమిత్వ అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా ఒకేసారి మూడు లక్షల గృహప్రవేశాలు చేయాలని నిర్ణయించారన్నారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యంలో ఇప్పటికే దాదాపు 7,000 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. హౌసింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి పెండింగ్ పనులు పూర్తి అయ్యేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. లే అవుట్లలో అవసరమైన మౌలిక సౌకర్యాలపై ప్రతిపాదనలు అందించాలన్నారు. పీఎంఏవై 2.0 పథకం ద్వారా ఆసక్తి ఉన్న వారి నుంచి ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులను ఈటీపీఎస్‌లో నమోదు, సచివాలయాలకు సంబంధించి కౌశలం సర్వే, స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీని నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సీపీఓ శేషశ్రీ, డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి, హౌసింగ్, డ్వామా పీడీలు, డీపీఓ సాయికుమార్, భూగర్భ జలవనరుల శాఖ ఉపసంచాలకులు వందనం పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

కార్పొరేషన్ స్వాధీనంలోకి కొల్లి శారద మార్కెట్

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న కొల్లి శారద మార్కెట్‌ను గుంటూరు నగర పాలక సంస్థ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మార్కెట్ లోపలికి ఎవరూ వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. మార్కెట్‌లోని 81 షాపుల నిర్వహణకు వేలం పాటలు నిర్వహించారు. రికార్డు స్థాయిలో సంవత్సరానికి రూ.6 కోట్లకు పాటదారులు షాపులను పాట పాడుకున్నారు. వారికి దుకాణాలు అప్పగించేందుకు అధికారులు ప్రయత్నించగా.. పాత పాటదారులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. నందివెలుగు రోడ్డులో ధర్నా చేపట్టారు. ఆందోళనల నడుమే.. కార్పొరేషన్ అధికారులు మార్కెట్లోని షాపులను స్వాధీన పరుచుకున్నారు. పాట దారులు నగదు చెల్లించి షాపుల ను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కొల్లి శారద మార్కెట్లోకి వెళ్లకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఏపీ విద్యా ప్రతిష్ట.. లీప్!

ఈ విద్యా సంవత్సరం నుంచే లీప్ స్కూల్స్



లీప్ స్కూల్‌లో ఓ తరగతి గది

- నియోజకవర్గానికి ఒకటి వంతున ఏర్పాటు
- నిడమర్రులో తొలి లీప్ మోడల్ స్కూల్
- రూ.15 కోట్లతో సమగ్రాభివృద్ధి
- 2029-30 కల్లా పాఠశాల విద్య బలోపేతం
- విద్యా ప్రమాణాల పెంపునకు లోకేశ్ వ్యూహం



- లీప్ స్కూల్‌లో బి బ్లాకు

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)
పేరుకు డిగ్రీలు చదివినా.. ఇంగ్లీషు చదవడం రాదు.. తెలుగు ఉచ్చారణ అసలే పలకదు. చిన్న చిన్న లెక్కలు.. ఎక్కాలు చెప్పమంటే అన్నీ శుద్ధ తప్పులే! ఇదీ 2024 వార్షిక విద్యా స్థితి (యాసర్) నివేదిక. ఈ నిరాశజనకమైన ఫలితాలను చూసి ఖిన్నుడైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు.. దిద్దుబాటు చర్యలు తీసుకున్నారు. అందులో భాగమే.. లీప్ పాఠశాలల స్థాపన. ఈ కొత్త ప్రాజెక్టు ప్రాథమిక విద్యలో నాణ్యతను పెంచుతుంది. తద్వారా దేశంలోని ఇతర రాష్ట్రాలతో సమ ఉజ్జీగా (మిగతా 8వ పేజీలో)

బర్లీకి గోడౌన్లు కావలెను

- ఇప్పటికే 33 చోట్ల పొగాకు నిల్వలు
- మరో 11 కేంద్రాల్లో ప్రస్తుతం కొనుగోళ్లు
- ప్రైవేటు గోదాములపై మార్క్‌ఫెడ్ దృష్టి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ కొంటున్నప్పటికీ వాటిని నిల్వ ఉంచే గోదాముల లభ్యత ప్రస్తుతం సవాల్‌గా మారింది. కొనుగోళ్ల ప్రక్రియ రెండు నెలల నుంచి జరుగుతుండగా ఇప్పటికే ఎఫ్‌సీఐ, వేర్ హౌసింగ్ కార్పొరేషన్, మార్కెటింగ్ గోడౌన్‌లు ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్.. అక్కడే నిల్వ ఉంచింది. ప్రకాశం జిల్లా పొదిలితో పాటు బాపట్లలోని వేర్ హౌసింగ్ గోడౌన్‌లను కూడా ఇందుకోసం ఇప్పటికే ఉపయోగించారు. బాపట్లతో పాటు గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలోని 33 గోడౌన్‌లు ఇప్పటికే బర్లీ పొగాకుతో నిండిపోయాయి. మరో 11 కేంద్రాల్లో ప్రస్తుతం బర్లీ కొనుగోళ్ల జరుగుతున్నాయి. ఇవి కూడా మరో రెండు మూడు రోజుల్లో నిండిపోనున్నాయి. తదుపరి కొనే బర్లీని ఎక్కడ నిల్వ ఉంచాలనేదే ఇప్పుడు మార్క్‌ఫెడ్‌కు సవాల్‌గా మారింది. బాపట్లతో పాటు గుంటూరు జిల్లాలోని ప్రైవేటు గోడౌన్‌లపై అధికారులు దృష్టి సారించారు. అయితే.. అవి కూడా రైతులు తమ ఉత్పత్తులను అద్దె ప్రాతిపదికన నిల్వ ఉంచుకోవడంతో ఖాళీగా లేవని క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. దీంతో నిల్వ విషయంలో ఏం చేయాలో పాలుపోవడం లేదని అధికారులు వాపోతున్నారు. ఇతర జిల్లాల్లో ప్రభుత్వ విభాగాల గోడౌన్‌లు కొంత మేర అందుబాటులో ఉన్నప్పటికీ, అక్కడికి రైతులు బర్లీని తీసుకెళ్లడం అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని.. ఈ నాలుగు జిల్లాల పరిధిలోనే గోడౌన్‌ల కోసం వెతుకుతున్నామని (మిగతా 8వ పేజీలో)



బర్లీ పొగాకు బేళ్లతో నిండిపోయిన పర్చూరు ఏఎంసీ గోడౌన్

రైతుల ఖాతాల్లో రూ.110 కోట్లు జమ
ఇప్పటి వరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన పొగాకుకు సంబంధించి రైతుల ఖాతాల్లో దాదాపు రూ.110 కోట్లు జమ చేయనుంది. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఇటీవలే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి నిధుల విడుదలపై చర్చించారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని మార్క్‌ఫెడ్ చెబుతోంది.

నేడు నగరంలో తాగునీటి సరఫరా
- 24 గంటల ముందే పైపు లైన్ల మరమ్మతులు పూర్తి

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో పైపు లైన్లు ఇంటర్ కనెక్షన్లు, మరమ్మతులు సోమవారం పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం వరకు మరమ్మతులు జరుగుతాయని తొలుత ప్రకటించిన అధికారులు.. 24 గంటలు ముందుగానే పూర్తి చేశారు. ఇందుకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంగళవారం ఉదయం నుంచే నగరంలో నీటి సరఫరా యథావిధిగా కొనసాగనుంది. మధ్యాహ్నం నుంచి నెహ్రూనగర్ పరిధిలోని శారదా కాలనీ, వసంతరాయపురం రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలకు సాయంత్రం నీటి సరఫరా చేయడం జరుగుతుంది. సాయంత్రం 7 గంటల నుంచి లక్ష్మీపురంలోని హెచ్ఎల్ఆర్‌కి పంపింగ్ జరుగుతుంది.



పైప్ లైన్‌కు పూర్తయిన మరమ్మతులు

1నే రంఛనుగా పింఛన్
- మంత్రి నాదెండ్ల మనోహర్



దివ్యాంగురాలికి పెన్షన్ అందజేస్తున్న మంత్రి

1నే ఠంఛనుగా పింఛన్

మంత్రి నాదెండ్ల మనోహర్


మంచంలో ఉన్న వృద్ధుడికి పెన్షన్ ఇస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 62 లక్షల మందికి 1వ తేదీనే ఠంఛనుగా పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, ఏ ప్రభుత్వం కూడా ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని అమలు చేయలేకపోయిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రూరల్ మండలం సంగం జాగర్లమూడిలో సోమవారం వృద్ధులు, వికలాంగులు, మహిళలకు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు స్వయంగా అందజేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నామని, ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. వికలాంగుల కోసం మరోసారి తెనాలిలో సదరన్ క్యాంపు ఏర్పాటు చేసి వారి పెన్షన్లను సమీక్షిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికి స్మార్ట్‌రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి కల్పనకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఈ నెలలో ఇక్కడే ఏర్పాటు చేస్తామని, గ్రామంలో సైడు కాల్వలను బాగు చేసేందుకు, రహదారులను అభివృద్ధి చేసేందుకు, మంచి నీటి వసతి మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. గుంటూరు ప్రధాన రహదారిని గతంలో గుంతల మయం చేశారని, ప్రయాణానికి అనుకూలంగా తీర్చిదిద్దామన్నారు. రూ.700 కోట్లతో గుంటూరు-తెనాలి-మంగళగిరి రహదారిని నాలుగు లైన్లుగా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి చెప్పారు. నియోజకవర్గంలో 35,563 మందికి రూ.14.99 కోట్లు పెన్షన్ ప్రతినెలా పారదర్శకంగా లబ్ధిదారుని ఇళ్ల వద్దే అందజేయడం తమ ప్రభుత్వ ఘనతగా చెప్పారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్తిపాటిపై రెండు కేసుల కొట్టివేత

చిలకలూరిపేట, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన అనుచరులపైన వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలీసులు పెట్టిన రెండు కేసులను చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ అనంతరం సోమవారం జడ్జి కే నరేంద్ర రెడ్డి కొట్టివేశారు. 2023 సెప్టెంబరులో చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ చిలకలూరిపేట నియోజక వర్గంలో టీడీపీ శ్రేణులు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. ఆ సందర్భంలో ప్రత్తిపాటి పిలుపు మేరకు జాతీయ రహదారిపై తిమ్మాపురం వద్ద ధర్నా చేశారని యడ్లపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. ఈ కేసులో ప్రత్తిపాటితో పాటు యడ్లపాడు మండలానికి చెందిన మరో 20 మంది సీనియర్ టీడీపీ నాయకులపై కేసు నమోదయింది. కాగా 2024లో చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మరొక కేసుకు సంబంధించి కూడా ప్రత్తిపాటితో పాటు మరో 29 మందిపై కోర్టులో విచారణ జరిగింది. అప్పటి మంత్రి విడదల రజిని మరిది విడదల గోపీ, అతని అనుచరులు, పలువురు వైసీపీనేతలు కోటప్పకొండ వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలతో ఘర్షణకు పాల్పడిన అనంతరం చిలకలూరిపేట అర్బన్ పోలీసు స్టేషన్ వద్ద జరిగిన ఘటనపై టీడీపీనేతలు, కార్యకర్తలతో పాటు ప్రత్తిపాటిపై కూడా కేసు నమోదయింది. ఈ రెండు కేసులకు సంబంధించి మొత్తం 51 మందికి విముక్తి లభించింది. ప్రాసిక్యూషన్ తరపున పీపీ మహేంద్ర, నిందితుల తరపున న్యాయవాదులు ఈపూరి బ్రహ్మానందం, తుబాటి పూర్ణచంద్రరావు, జీవీహెచ్ ప్రసాద్, టీడీపీ లీగల్ టీమ్ విచారణలో పాల్గొన్నారు.




ప్రకాశం బ్యారేజి వద్ద

పెరిగిన వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన వున్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి సోమవారం 3,42,398 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 3,28,125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 7,247 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7,026 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు ఛానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో సోమవారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 586.00 అడుగులు ఉంది. ఇది 303.32 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5226 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 31,262 క్యూసెక్కులు, 14 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 12 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,78,160 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 3,26,248 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో వాటర్‌గా 2,54,234 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పశ్చిమడెల్టాకు 7026 క్యూసెక్కుల..

దుగ్గిరాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపశ్చిమడెల్టాకు విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి 7026 క్యూసెక్కుల నీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ఎగువనున్న నాగార్జునసాగర్ నుంచి భారీగా నీటివిడుదల చేస్తుండటంతో, బ్యారేజి నుంచి దిగువకు 3,28,125 క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌ఛానల్‌కు 276 క్యూసెక్కులనీరు, రేపల్లెకాల్వకు 1760 క్యూసెక్కులనీరు, తూర్పుకాల్వకు 479 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 240 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 465 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 2680 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 37.86 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,91,875 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, పది గేట్ల ద్వారా 2,99,364 క్యూసెక్కులు, మొత్తం 3,16,364 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు పోటెత్తిన వరద

రెంటచింతల,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు పోటెత్తింది. 20 గేట్లకు గాను 19 రేడియల్ క్రస్ట్ గేట్లను 3.5 మీటర్ల ఎత్తి పులిచింతలకు 3,41,297 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం చెప్పారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు సాగర్ నుంచి 3,11,211 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని తెలిపారు. విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపి వేశామన్నారు. ప్రమాద హెచ్చరిక గంటలను మోగిస్తున్నామన్నారు.రిజర్వాయర్‌లో 74.47 మీటర్లు నీరుండగా.. 244.32 అడుగులకు అంటే 6.3890 టీఎంసీలకు సమానమని తెలిపారు.


19 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

టెన్త్ మార్కుల జాబితాలు అదృశ్యం

- ఆందోళనలో 82 మంది విద్యార్థులు
- ఆత్మకూరు నిర్మలా స్కూల్‌లో నిర్వాకం
- ఎంఈఓ కార్యాలయం వద్ద తల్లిదండ్రుల ధర్నా


మంగళగిరి విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మంగళగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చెందాల్సిన పదవ తరగతి మార్కుల జాబితా బండిల్ మాయమైపోయింది. దీంతో తమ ఒరిజినల్ మార్కుల జాబితాలను అందజేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సదరు విద్యాసంస్థ, మండల విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని ఆత్మకూరు నిర్మలా ఇంగ్లీషుమీడియం స్కూల్లో సీబీఎస్ఈ పదవ తరగతి చదివిన విద్యార్థుల మార్కుల జాబితాలు ఏకమొత్తంగా అదృశ్యమయ్యాయి. మూడు నెలలు కావొస్తున్నా... తమ మార్కుల జాబితాలు ఇవ్వకుండా తిప్పుతున్న యాజమాన్యం వైఖరితో విసిగిపోయిన విద్యార్థులు, తల్లిదండ్రుల విచారణలో చావుకబురు చల్లగా తెలిసిపోయింది. ఢిల్లీనుంచి జూన్ 20న పోస్టులో వచ్చిన 82 మంది టెన్త్ విద్యార్థుల మార్కుల జాబితా బండిల్‌ను స్కూలు సిబ్బంది కార్యాలయంలో రత్న అనే ఉద్యోగి స్వీకరించి రిజిస్టర్ పోస్టల్ తాఖీదుపై సంతకం కూడా చేసినట్టు చెబుతున్నారు. అయితే ఆ తర్వాత ఆ బండిల్ కనిపించకుండా పోవడంతో సిబ్బంది అందరూ దానిని వెతికే పనిలో పడ్డారు. విద్యార్థులకు స్కూలు యాజమాన్యం ఫలితాల వెల్లడి సందర్భంగా ఇంటర్నెట్‌లో డిస్‌ప్లే అయిన మార్కుల జాబితాలను ప్రింట్లు తీసి.. వాటిని అటెస్టేషన్ చేసి ఇస్తోంది. ఎంఈఓ ఉషాకుమారి నిర్మలా స్కూల్ హెచ్ఎంను పిలిపించుకుని విచారణ చేశారు. అదృశ్యమైన మార్కుల జాబితా బండిల్ గురించి తాము ఇప్పటికే ఢిల్లీలోని సీబీఎస్ఈ, రీజినల్ కార్యాలయాలకు సమాచారమందించామని వివరణ ఇచ్చారు. ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖాధికారి విచారించి... పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్మలా స్కూలు యాజమాన్యానికి సూచించారు.

ఏపీ అభివృద్ధిలో చెరగని సంతకం సీఎం చంద్రబాబు

జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్‌కుమార్, చిత్రంలో హెనీ క్రిస్టీనా తదితరులు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చెరగని సంతకం సీఎం చంద్రబాబు నాయుడు అని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. చంద్రబాబు సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సెప్టెంబరు 1వ తేదీని పురస్కరించుకుని గుంటూరు జిల్లా పరిషత్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు పూర్తి కావటం సంతోషించ దగిన పరిణామం అన్నారు. దేశంలో ఉన్న ముఖ్యమంత్రులలో ఆయనే సీనియర్ అని అన్నారు. అంత సీనియారిటీ ఉన్నప్పటికీ ఆయా వేదికలపై ఆయన ప్రదర్శించే వినమ్రత నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శ ప్రాయం అన్నారు. తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్‌ను సైబరాబాద్‌గా మార్చిన చంద్రబాబు మాత్రమే ఆంధ్రుల నూతన రాజధాని అమరావతిని తీర్చి దిద్దగలరని అన్నారు. రాయలసీమకు కూడా కృష్ణానీటిని తీసుకు వెళ్లిన ఆయన అపరభగీరథుడు అన్న కీర్తిని స్వంతం చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రూరల్ ఎంపీడీవో బండి శ్రీనివాస్, ఏఓ శామ్యూల్ పాల్, పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కూచిపూడి మోహన్, జిల్లా అధ్యక్షులు పూర్ణచంద్రా రెడ్డి, ఓఎస్డీ శివన్నారాయణ, పరిపాలన అధికారులు నిర్మల జ్యోతి, రామకోటయ్య, రాజా రత్నం,ఫైజుల్లా ఖాన్, క్యాంపు కార్యాలయ సిబ్బంది అత్తోట పృథ్వి, జగదీష్ పాల్గొన్నారు.

నేషనల్ ఎస్సీ ఫెలోషిప్‌పై సమీక్ష

ఏఎన్‌యూ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న నేషనల్ ఎస్సీ ఫెలోషిప్స్‌పై సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అధ్యయనం జరిగింది. ఢిల్లీ నుంచి యూజీసీ కో-ఆర్డినేటర్ వై.అశోక్ కుమార్ వర్సిటీని సందర్శించారు. వర్సిటీలో ఫెలోషిప్ తీసుకునే పరిశోధకులతో ఆయన మాట్లాడారు. ఫెలోషిప్స్ పొందేందుకు ఇబ్బందులు, మెరుగు తదితర అంశాలతో కూడిన అభిప్రాయాలను తీసుకున్నారు. వర్సిటీలో జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ ఫెలోషిప్‌లను 16 మంది పొందుతున్నట్లు గుర్తించారు. వారి పరిశోధనలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎం. సురేష్ కుమార్, కె.వీరయ్య, సీహెచ్ లింగరాజు, డాక్టర్ అంబేద్కర్ ఫెలోషిప్స్ పొందుతున్న పరిశోధకులతో మాట్లాడారు. అనంతరం వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ జి. సింహాచలం, ఓఎస్డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.


వీసీ ఆచార్య గంగాధరరావుతో యూజీసీ ప్రతినిధులు

విద్యుత్‌శాఖలో తుది దశకు చేరిన ఉద్యోగుల విభజన

- జాబితా సిద్ధం చేసిన ఉన్నతాధికారులు

గుంటూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగుల విభజన ప్రక్రియ తుది దశకు చేరుకున్నది. ఈనెల 12న ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ఉన్నతాధికారులు సూత్రప్రాయంగా ప్రకటించారు. ఇటీవల సంస్థలో జరిగిన సర్కిల్స్ పునఃర్విభజనపై అనేక ప్రాంతాల నుంచి స్వల్ప అభ్యంతరాలు రావటంతో ఆ దిశగా ఉన్నతాధికారులు కసరత్తు చేశారు. సర్కిల్స్ పునఃర్విభజనలో స్వల్ప మార్పులు, చేర్పులపై దృష్టి సారించి ఆ ప్రక్రియ పూర్తి చేశారు. తద్వారానే ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో జాప్యం జరిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీఆర్‌డీఏ, గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్‌లో ఇటీవల మార్పులు, చేర్పులతో పునర్విభజన చేస్తూ సీఎండీ పీ పుల్లారెడ్డి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. సర్కిల్స్ పునఃర్విభజన జరిగి నెలలు గడుస్తున్నా ఉద్యోగుల విభజన ప్రక్రియలో తీవ్ర జాప్యం జరగటంపై ఉద్యోగుల్లో కొంత అసహనం వ్యక్తమవుతోంది. దాంతో సీఎండీ పీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్‌లు ఉద్యోగుల విభజనపై కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా విభజనతో ఉద్యోగులను కొత్త సర్కిల్స్, డివిజన్ కార్యాలయాలకు బదిలీ చేయనున్నారు. ఇప్పటికే ఉద్యోగులకు బదిలీలపై ఆప్షన్స్ ప్రక్రియ చేపట్టిన అధికారులు ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టారు. ఈనెల రెండో వారంలోనే ఉద్యోగుల విభజన ప్రక్రియ కూడా దాదాపు పూర్తి చేయనున్నట్లు సమాచారం. తద్వారా పలువురు ఉద్యోగులకు స్థానచలనాలు తప్పవు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ: డ్రైవర్ మృతి


దాసరి శివయ్య దాసు (ఫైల్ ఫొటో)

నకరికల్లు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అడ్డరోడ్డు నుంచి నరసరావుపేట మార్గంలో అడ్డరోడ్డు - దేచవరం రహదారికి సమీపాన సోమవారం ఆర్టీసీ బస్సు ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయ పడి నరసరావుపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. దర్శి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన దాసరి శివయ్యదాసు ఆదివారం నుదురుపాడులోని ఇంటి సామగ్రిని తీసుకెళ్లాడు. తిరిగి ధర్మవరం ఆటోలో వస్తున్నాడు. ఉదయం బొమ్మరాజుపల్లి నుంచి గుంటూరు వెళ్లే ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట ఆర్టీసీ డీఎం బి.శ్రీనివాసరావు పరిస్థితిని సమీక్షించారు. నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

దాచేపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని కన్పించకుండా పోవడంతో పాఠశాల సిబ్బంది దాచేపల్లి పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పాపారావు వివరాల మేరకు.. మండలంలోని నారాయణపురం గ్రామంలోని ఫాతిమా మాత ఇంటిగ్రేటెడ్ స్పెషల్ స్కూల్ హాస్టల్ నుంచి రాత్రి 9:30 గంటలకు విద్యార్థిని జినుగు మహేశ్వరి(17) కనిపించకుండా పోయింది. స్కూల్ సిబ్బంది వెతికించినప్పటికీ ఫలితం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థిని ఆచూకి తెలిసిన వారు ఎస్ఐ: 80990 71585, ఎస్‌హెచ్‌వో 94407 96239 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

‘బర్లీ’కి గోడౌన్లు కావలెను!

(5వ పేజీ తరువాయి)

మార్క్‌ఫెడ్ చెబుతోంది.

ఇంకా రైతుల వద్ద లక్ష క్వింటాళ్లు..

రైతుల వద్ద ఇంకా లక్ష క్వింటాళ్ల వరకు బర్లీ పొగాకు నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఒక్క బాపట్ల జిల్లాలోనే 1.08 లక్షల క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. గుంటూరు జిల్లాలో 23,500, పల్నాడులో 17,300, ప్రకాశం జిల్లాలో 12,800 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసిన బర్లీ గోడౌన్‌లకు చేరింది. నాలుగు జిల్లాల పరిధిలో 8,500 మంది రైతులకు మేలు జరిగింది. అధికారుల లెక్కల ప్రకారమే బర్లీని అమ్ముకోవడం కోసం రిజిష్టర్ చేసుకున్న రైతుల సంఖ్యే ఇంకా 8,000 వరకు ఉండగా, ఒక్క బాపట్ల జిల్లాలోనే 5,800 మంది వరకు రైతులు తమ వంతు కోసం వేచి ఉన్నట్లు సమాచారం. గోడౌన్‌లు అందుబాటులో లేకపోవడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. మరో వైపు ఇప్పటికే దాదాపు ప్రభుత్వ గోడౌన్‌లన్నింటిలోనూ బర్లీ నిల్వలే పూర్తిస్థాయిలో దర్శనమిస్తున్నాయి. నెలల తరబడి అక్కడ నిల్వ ఉంచడం, నిత్యం పర్యవేక్షణ కూడా కీలకం కానుంది. ఇప్పటికే ఒకటి రెండు చోట్ల పొగాకు బేళ్లు దెబ్బతిన్నట్లు తమ దృష్టికి వచ్చిందని యంత్రాంగం చెబుతోంది. మరో వైపు ఖరీఫ్ దిగుబడుల నాటికి గోదాముల అవసరం మరింతగా ఉండనుంది.

ప్రయాణికుడి కోసం.. కిలోమీటరు వెనక్కి వెళ్లిన రైలు

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రయాణికుడు ప్రమాదవశాత్తూ కిందపడిపోవడంతో.. అతనిని ఆస్పత్రికి తరలించేందుకు అదే రైలుని కిలోమీటరుకుపైగా వెనక్కి నడిచింది. ఈ సంఘటన సోమవారం రాత్రి గజ్జలకొండ - మార్కాపురం సెక్షన్‌లో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. రేపల్లెకు చెందిన ఒక కుటుంబం రైలు నంబరు 17211 మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ కొండవీడు ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు నుంచి బయలుదేరింది. రైలు గజ్జలకొండ దాటిన తర్వాత జనరల్ బోగీలోని ప్రయాణికుడు చేతులు కడుక్కొనే సమయంలో అదుపు తప్పి కిందపడిపోయాడు. ఇది గమనించిన అతని కుటుంబ సభ్యులు అలారం చైన్ లాగడంతో రైలు కిలోమీటర్ దూరం ప్రయాణించాక ఆగింది. రైల్వే సిబ్బంది జనరల్ కోచ్ వద్దకు చేరుకొని విచారించి ప్రయాణికుడు కిందపడిపోయాడని తెలుసుకొన్నారు. కంట్రోలింగ్ విభాగానికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆ మార్గంలో మరో రైలుకు సిగ్నల్ ఇవ్వకుండా.. చర్యలు తీసుకొని క్షతగాత్రుడిని వెతుక్కొంటూ కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ని వెనక్కు నడిపారు. కిలోమీటర్ వెనక్కు వెళ్లిన తర్వాత క్షతగాత్రుడు కనిపించడంతో రైలులో ఎక్కించుకొని మార్కాపురం రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ కారణంగా మార్కాపురంలో రైలు 20 నిమిషాల పాటు నిలిచిపోయింది. ఈ ఘటనపై ఆర్పీఎఫ్ సిబ్బంది విచారణ జరుపుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

38,663 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 40,877 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 38,663 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,718 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	14200
నెంబరు. 5	10000	13400
273	10000	13600
341	10000	15300
4884	---	---
సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15400
షార్క్-1	-----	----
బ్యాడిగి 355	10000	14600
దేవనూరు డీలక్స్	10000	13800
ఆర్మూరు	9800	12200

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14200
నెంబరు. 5	10000	13500
273	---	---
341	11000	15500
4884	10000	13500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15300
బ్యాడిగి 355	10000	14500
దేవనూర్ డీలక్స్	10500	13500
ఆర్మూరు	---	---
తాలుకాయలు	5000	7800

దార్శనికుడు సీఎం చంద్రబాబు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, టీడీపీ శ్రేణులు

గుంటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలపాటు ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో సువర్ణ అధ్యాయం లిఖించిన దార్శనికుడు సీఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే నసీర్ కొనియాడారు. సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు నిండిన సందర్భంగా సోమవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి సీఎం చంద్రబాబులాంటి నాయకుడు దొరకడం అదృష్టమని అన్నారు.

● గుంటూరు నగరంలో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక సంజీవయ్య నగర్ గేటు వద్ద చేపట్టిన మంచినీటి పైపులైను మరమ్మతు పనులను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. పైపులైన్ల ఏర్పాటులో తీసుకుంటున్న జాగ్రత్తలు, నాణ్యతా ప్రమాణాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

● కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో గుంటూరు నగరాన్ని అభివృద్ధికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు వారితోట, శీలంవారి వీధిలో రూ.76 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు.

● ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చిందంటే అవ్వతాతల మోముల్లో ఆనందాలను చూస్తుంటామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం ఆయన పింఛన్లను పంపిణీ చేశారు.

నాలుగు సార్లు సీఎంగా చేసిన ఘనత చంద్రబాబుది

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

గుంటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగు నేలపై 4 సార్లు ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల 11 నెలలపాటూ పరిపాలించిన ఏకైక సీఎంగా రికార్డు సృష్టించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. సీఎం చంద్రబాబు ముఖ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించి నేటితో 30 సంవత్సరాలు పూర్తి చేసు కున్న సందర్భంగా టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేసి టీడీపీ శ్రేణులు వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్, ఏపీ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ హాజరై కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకొని సంబరాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ 15 ఏళ్ల పాలనా కాలంలో రాష్ట్ర రాజకీయా ల్లోనే కాక, దేశ రాజకీయాల్లో కూడా అనేక సంక్షోభాలను పరిష్కరించిన అపర చాణక్యుడిగా చంద్రబాబు అని జాతీయస్థాయిలో పేరుగాంచారన్నారు. ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ అభివృద్ధికి నిలువెత్తు చిరునామా చంద్రబాబు అని అన్నా రు. సమావేశంలో ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన యడ్లపల్లి సాంబశివరావును తెనాలి శ్రావణ్ కుమార్ దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో దాసరి రాజామాష్టారు, కంచర్ల శివరామయ్య, గుంటుపల్లి మధుసూదనరావు, బొబ్బిలి రామారావు, నూతలపాటి రామారావు, డీ. శ్రీనివాసరావు, పుట్టి రామచంద్రరావు, పప్పుల దేవదాస్, కేఎంఈ హుస్సేన్, షేక్ చిన్న బాజీ, పుల్లా సుందరంబాబు, బెల్లంకొండ సురేష్, లామ్ నవమి, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు మారుపేరు చంద్రబాబు: పిల్లి మాణిక్యరావు

గుంటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సుపరిపాలనకు మారుపేరు సీఎం చంద్రబాబు అని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు పత్రికా ప్రకటన విడుదల చేసారు. ఒక శిఖండి నుంచి పార్టీని కాపాడి నేటి వరకు ప్రజల హృదయాల్లో సజీవంగా ఉంచారన్నారు. చంద్రబాబు సీఎంగా తొలిసారి ప్రమాణస్వీకారం చేసినా ఈ 30 ఏళ్లలో ఎన్నో అద్భుత ఆవిష్కరణలకు బ్రాండ్ అయ్యారని తెలిపారు. తెలుగు ప్రజల తలరాతలను మార్చి, తెలుగు జాతి ఖ్యాతి దశదిశలా వ్యాప్తికి కారణమయ్యారని కొనియాడారు. పాలన అంటే పెత్తనం కాదు, పోషణ అని చెప్పిన దార్శనికుడని, 70 ఏళ్లు దాటినా చంద్రబాబు ఆలోచనలు నిత్య నూతనమన్నారు. సుపరిపాలనతోనే శాశ్వత అభివృద్ధి సాధ్యమని చంద్రబాబు నిరూపించారని తెలిపారు.

పీజీఆర్‌ఎస్‌కు అధికారులు హాజరవ్వాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్ కు విభాగాధిపతులతోపాటు క్షేత్ర స్థాయి అధికారులు కూడా హాజరు కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు. పీజీఆర్ఎస్ ద్వారా 24 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 9, ఇంజినీరింగ్ విభాగం 5, రెవెన్యూ విభాగం 5, ప్రజారోగ్య విభాగం 2, బర్త్ అండ్ డెత్ విభాగం 1, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 2 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కారుచౌకగా కర్నూలు ఉల్లిపాయలు

● కేజీ రూ. 17కే రైతుబజార్లలో విక్రయం


ఉల్లిపాయల విక్రయాలు పరిశీలిస్తున్న సీఈవో మాధవీలత

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపాయల ధరలు పతనమై కర్నూలు జిల్లా రైతులు సంక్షోభంలో కూరుకుపోతుండటంతో వారికి అండగా నిలిచేందుకు మార్కెటింగ్ శాఖ సిద్ధమైంది. ఆ జిల్లా నుంచి 10 టన్నుల కర్నూలు ఉల్లిపాయలను జిల్లాకు దిగుమతి చేసుకొని రైతుబజార్లు, మొబైల్ వ్యాన్ల ద్వారా విక్రయాలకు శ్రీకారం చుట్టింది. రైతుల వద్ద సేకరించిన ధరకే వినియోగదారులకు జిల్లాలోని రైతుబజార్లలో అందుబాటులో ఉంచింది. కేజీ రూ. 17 చెల్లించి ఎన్ని కిలోలు కావాలంటే అన్ని తీసుకొనే సౌలభ్యాన్ని కల్పించింది. సోమవారం రైతుబజార్ల రాష్ట్ర సీఈవో మాధవిలత, మార్కెటింగ్ శాఖ గుంటూరు అసిస్టెంట్ డైరెక్టర్ పీ సత్యన్నారాయణ చౌదరి చుట్టుగుంట, కృష్ణనగర్‌లోని రైతుబజార్‌ని సందర్శించి అక్కడ జరుగుతున్న ఉల్లిపాయల విక్రయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాధవిలత మాట్లాడుతూ నాణ్యమైన ఉల్లిపాయలను అతి తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్‌ల ఎస్టేట్ అధికారులు, మార్కెటింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో ఎల్ఐసీది కీలకపాత్ర

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మౌలిక రంగాలకు కోట్లాది రూపాయల పెట్టుబడులను సమకూరుస్తూ దేశాభివృద్ధిలో ఎల్ఐసి కీలక పాత్ర పోషిస్తుందని హిందూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. విశ్వం తెలిపారు. ఎల్ఐసీ 69వ వార్షికోత్సవాలను అరండల్ పేటలోని కార్యాలయంలో సోమవారం ఆయన ప్రారంభించారు. వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ పి.తిరుమలరావు ఉద్యోగులు పాల్గొన్నారు.

చవితి వేడుకలతో ఆధ్యాత్మికత

గుంటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలతో సమాజంలో ఆధ్యాత్మిక వెల్లివిరుస్తుందని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. చుట్టుగుంటలో దొంతా బ్రహ్మం, కేవీపీ కాలనీలో కార్పొరేటర్ కాండ్రకుంట గురవయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుల ఉత్సవాలకు ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తమ్మిశెట్టి శ్రీనివాసరావు, రాయపాటి పవన్‌కుమార్, వెంకటరావు, తిరుమలేశ్వరరావు, విజయ్, సాంబయ్య, రవీంద్రనాయక్, అనీల్‌నాయక్, కోటా వేణుగోపాలరావు, కోటేశ్వరరావు తదితరులున్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చి అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. సోమవారం కలక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 220 అర్జీలు వచ్చాయి. జే సీ భార్గవతేజ, డిఆర్వో ఖాజావలీ, డిప్యూటి కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్‌తో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పై అధికారుల స్థాయిలోనే అర్జీని పరిష్కరించాలన్నారు. జేసీ భార్గవ తేజ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మహిళా కమిషన్, కోర్టు కేసులకు సంబంధించి నిర్ణీత సమయంలో కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. ఈపిటిఎస్‌లో డాక్యుమెంట్లు అప్ లోడ్‌ను వేగవంతం చేయాలన్నారు. అనంతరం డిస్ట్రిక్ కో ఆపరేటివ్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్‌లో ఇద్దరికి కంప్యూటర్ల ఆపరేటర్లుగా నియమిస్తూ కారుణ్య నియామక పత్రాలును కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డిపివో నాగసాయికుమార్, డీఆర్డీఏ, హౌసింగ్ పిడిలు విజయలక్ష్మి, ప్రసాదు, డిటిసి సీతారామిరెడ్డి, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి నెలకు ఒకసారి దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ విభిన్న ప్రతిభావంతుల ఆదరణ సమితి అధ్యక్షుడు వెలుగు శివప్రసాదు అర్జీ అందజేశారు.

● అధిక వడ్డీ కోసం వ్యాపారస్తులు వేదిస్తున్నారంటూ పెదకాకాని, వెంగళరావునగర్‌కు చెందిన కూరాకుల సత్యానారాయణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ధ్వని కాలుష్యం నివారించాలి : జేవీవీ

గుంటూరు, కార్పొరేషన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వం ధ్వని కాలుష్యాన్ని నివారించడానికి ఇటీవల తీసుకొచ్చిన ప్రత్యేక చట్టం మాదిరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా వెంటనే ధ్వని కాలుష్యాన్ని నివారించేందుకు చట్టం రూపొందించి అమలు చేయాలని, జనచైతన్య వేదిక నిర్వహించిన చర్చా గోష్టిలో వక్తలు అభిప్రాయపడ్డారు. సోమవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో ధ్వని కాలుష్యం నివారణపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఈఎన్‌టీ స్పెషలిస్ట్ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ పాల్గొని ప్రసంగించారు. 2000 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ధ్వని కాలుష్యంపై తెచ్చిన చట్టంలో తగిన మార్పులు చేసి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా అమలు చేయాలని పీఎస్ఎన్ మూర్తి కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి నందకిషోర్ మాట్లాడుతూ, ధ్వని తీవ్రతతో బీపీ, ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి లాంటి అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ప్రపంచంలో ఫిన్లాండ్, ఐస్ లాండ్, నార్వే, స్వీడన్ లాంటి దేశాలలో ధ్వని కాలుష్యం అతి తక్కువగా ఉంటుందని, ప్రజల చైతన్యమే ప్రధాన కారణమన్నారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సేవ కుమార్, రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి, హిందూ కళాశాల అధ్యాపకులు దుర్గాప్రసాద్, ఏపీ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు ఏవీ పటేల్, సామాజిక విశ్లేషకులు టీ ధనుంజయ రెడ్డి, విశ్రాంత తెలుగు అధ్యాపకుడు సూరం నారాయణరెడ్డి, మానవత కోశాధికారి టీవీ సాయిరాం, చావా శివాజీ, రేట్ పేయర్స్ అసోసియేషన్ నేత సదాశివరావు బీసీ మహాజనసభ కార్యదర్శి ఉగ్గం సాంబశివరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

సరోగసి చట్టం అమలు చేయాలి : డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సరోగసీ కింద నమోదైన వైద్యశాలలు ఏఆర్‌టీ (అసిస్టెడ్ రిప్రొడక్టివ్ థెరపీ) చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 27 హాస్పిటల్స్ ఏఆర్టీ, సరోగసి క్రింద రిజిస్టర్ అయినట్లు డాక్టర్ విజయలక్ష్మీ తెలిపారు. ఇవన్నీ తప్పనిసరిగా ఏఆర్‌టీ, సరోగసి చట్టానికి లోబడి పని చేయాలన్నారు. తనతోపాటు ఆరోగ్య శాఖ ప్రోగ్రామ్ అధికారులు తరచూ ఆయా సరోగసి కేంద్రాలను తనిఖీలు చేస్తామని ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా చట్టాన్ని ఉల్లంఘించినట్లు తేలితే ఆయా ఆసుపత్రుల యాజమాన్యంపై చట్ట ప్రకారము చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

బ్రాహ్మణులు వ్యాపార రంగంలో రాణించాలి

● రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరామ్‌ప్రసాద్

గుంటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులు వ్యాపార రంగంలో రాణించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కె బుచ్చిరామ్‌ప్రసాద్ తెలిపారు. ఇన్నర్‌రింగ్ రోడ్డులోని గాయత్రి మాత ఆలయ ప్రాంగణంలో బిజినెస్ బై బ్రాహ్మిణ్ గుంటూరు నూతన చాప్టర్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్ర రాజధాని ప్రాంతంలో బిజినెస్ ఫర్ బ్రాహ్మిన్ చాప్టర్‌ను ప్రారంభించటం శుభపరిణామమన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ మాట్లాడుతూ రాజధాని ప్రాంతమైన గుంటూరులో త్వరలో బ్రాహ్మణ నిరుద్యోగుల కోసం భారీ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్, బీజేపీ సీనియర్ నేత జూపూడి రంగరాజు, బిజినెస్ బై బ్రాహ్మిన్ జాతీయ అధ్యక్షులు బుర్రా ఫణి, జాతీయ కార్యదర్శి పరిమి గిరిధర్, గుంటూరు చాప్టర్ అధ్యక్షులుగా కొమ్మమూరు శ్రీధర్ బాబును, కార్యదర్శిగా బి హేమంత్ ను, కోశాధికారి గా బాలకృష్ణ ను ప్రతిపాదించగా, సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో విజయవాడ ప్రథమ మేయర్ జంధ్యాల శంకర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశశ్వి, చాణక్య సంస్థల అధినేత వెంకట్ ఇక్కుర్తి తదితరులున్నారు.

హెచ్‌ఐవీని పూర్తిగా రూపుమాపుదాం : కలెక్టర్

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌ను సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించాలంటే ఆ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకూడదని, వారి హక్కులను గౌరవించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మంది రంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కోసం 60 రోజుల విస్తృత ప్రచారంపై రూపొందించిన పుస్తకాన్ని, 'హెచ్‌ఐవీ గురించి చర్చిద్దాం/హెచ్‌ఐవీని నివారిద్దాం' పేరిట రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మీ మాట్లాడుతూ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ కలుషిత సూదులు, సిరంజుల ద్వారా, కలుషిత రక్తమార్పిడి, అరక్షిత లైంగిక సంబంధాల ద్వారా, తల్లి నుంచి బిడ్డకు వ్యాపిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్కే ఖాజావలి, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్‌డీవో కే శ్రీనివాసరావు , షిప్ అధ్యక్షురాలు ఏ రమాదేవి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతల కువిమర్శలు ఆపాలి : గాదె

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడుపుతున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు అవాకులు చెవాకులు పేలడం మానుకోవాలని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు హితవు పలికారు. సోమవారం గుంటూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేంద్ర ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తామని చెప్పినప్పుడు, 151 మంది వైసీపీఎమ్మెల్యేలు, నాటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి నోరు మెదపలేదని విమర్శించారు. పవన్ కళ్యాణ్ డిమాండ్‌తోనే 2020 ఫిబ్రవరిలో సుగాలి ప్రీతి కేసును సీబీఐకి అప్పగించారని, ప్రీతి కుటుంబానికి 5 ఎకరాల భూమి, 5 సెంట్ల ఇళ్ల స్థలం, సుగాలి ప్రీతి తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వైసీపీ నాయకుల అడుగుజాడల్లో నడుస్తున్న సుగాలీ ప్రీతి తల్లి పార్వతికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రభుత్వం ఇచ్చిన భూమిని, ఉద్యోగాన్ని వెనక్కి ఇచ్చేసి, పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సహించలేని వైసీపీ నాయకులు కువిమర్శలకు దిగుతున్నారని ఆయన మండిపడ్డారు. సమావేశంలో జనసేన నాయకులు అడపా మాణిక్యాలరావు, శిఖా బాలు, చట్టాల త్రినాధ్, మధులాల్, కాటూరి శ్రీనివాస్, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి పాల్గొన్నారు.

కనికట్టుతో కరెన్సీ కురిపించాడు

● తంత్ర విద్యలు ఉన్నాయంటూ లక్షలు కొట్టేశాడు

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితుడు

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తన కనికట్టుతో కరెన్సీ కురిపించాడు... తనకు సకల తంత్ర విద్యలు తెలుసంటూ అమాయకులకు వల విసిరాడు... అమాయకుడైన ఓ కారు డ్రైవర్‌కు ఆశ కల్పించి ముగ్గులోకి దించాడు. అతని నుంచి ఏకంగా రూ.10 లక్షలు కొట్టేశాడు.. ఈ విధంగా తుళ్లూరు మండలం అనంతపురం గ్రామానికి చెందిన కార్ డ్రైవర్‌ను కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం గరికపర్రుకు చెందిన కారుమంచి సుధాకర్ అనే వ్యక్తి పది లక్షలకు మోసం చేశాడు. దీంతో బాధితుడు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తుళ్లూరు మండలం అనంతరం గ్రామానికి చెందిన బాధితుడు వ్యవసాయ కూలీగా పని చేస్తూ అప్పుడప్పుడు డ్రైవర్‌గా కారు బాడుగలకు వెళ్తుంటాడు. ఇలా బాడుగలకు వెళ్లిన సందర్భంలో కృష్ణాజిల్లా గరికపర్రుకు చెందిన కారుమంచి సుధాకర్ పరిచయమయ్యాడు. తనకు సకల తంత్ర మంత్ర విద్యలు వచ్చని చెప్పుకొచ్చాడు. బాధితుడిని తీసుకువెళ్లి అక్కడ పూర్తి నగ్నంగా గాలిలోకి ద్రవ పదార్థం విసిరాడు. ఒకసారి గాలిలో నుంచి 500 రూపాయల నోట్లు 50వేల వరకు రాలాయి. అయితే నా వద్ద డబ్బు తీసుకోవడం ఎందుకు మీరు కావలసినంత సృష్టించుకోవచ్చు కదా అని బాధితుడు తన సందేహాన్ని వెలిబుచ్చగా ఇందుకు అవసరమైన పాదరసం లాంటి ద్రవం కొనుగోలు చేయాలంటే కోటి రూపాయలు వరకు అవుతుందని వారిని నమ్మించాడు. దీంతో బాధితుడు ఈ ఏడాది మే నెలలో మూడున తన మేనకోడలు బ్యాంకు అకౌంట్ నుంచి సుధాకర్ ఖాతాకు రూ. పది లక్షలు బదిలీ చేసాడు. దీంతో మీ 10 లక్షలకు 10 రెట్లు అంటే కోటి రూపాయలను 20 రోజుల్లో జూన్ 7న మీ ఇంటికి వచ్చి కురిపిస్తానని చెప్పాడు. ఆరోజు రాకపోవడంతో బాధితులు సుధాకర్ కు ఫోన్ చేయగా జులై 20న వస్తానని చెప్పాడు. ఆరోజు కూడా రాకపోవడంతో మళ్లీ సంప్రదించగా ఆగస్టు 7న వస్తానని చెప్పాడు. ఆ రోజు కూడా రాకపోవడంతో ఇంటికి వెళ్తే ఇంట్లో లేడని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో వాపోయాడు.

తెలుగు మహిళ పేరుతో వసూళ్లు

● ఎస్పీ కార్యాలయంలో పలువురు బాధిత మహిళల ఫిర్యాదు

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలుగు మహిళ నాయకురాలినని చెప్పుకుంటూ వాసిరెడ్డి ప్రసన్న రాధిక వసూళ్లకు పాల్పడి తిరిగి డబ్బులు అడుగుతుంటే బెదిరింపులకు దిగుతోందని పలువురు బాధిత మహిళలు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పలకలూరు రోడ్డులో నివాసం ఉంటున్న వాసిరెడ్డి ప్రసన్న రాధిక, తన కుమారుడినిపై చదువులు నిమిత్తం అమెరికా పంపుతున్నానని అత్యవసరంగా ఐదు లక్షలు తీసుకుందని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నేపాక పద్మావతి తెలిపారు. తనకు అత్యవసరమని చెప్పి తన వద్ద సుమారు 9 ఏళ్ల క్రితం 6 లక్షలు రెండు రకాలుగా తీసుకుందని పి మల్లేశ్వరి అనే మహిళ ఫిర్యాదు చేశారు. తాను ఏపీ, తెలంగాణ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్‌ని అని మల్లేశ్వరి చెప్పుకోవడం గమనార్హం. అలాగే తుమ్మల అనిల్ కుమార్ వద్ద ఐదు లక్షలు తీసుకున్నట్లు ఆయన బంధువు విజయ ఫిర్యాదు చేశారు. బెంగళూరులో విల్లా కొనుగోలు చేస్తున్నానని తన నుంచి రూ.46 లక్షలు తీసుకుందని శ్రీలక్ష్మీ అనే మహిళ ఫిర్యాదు చేశారు. తన వద్ద 35 వేలు తీసుకున్నట్లు గిరిజ అనే మహిళ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాగే మరో 50 మంది వరకు బాధితులు ఉన్నట్లు తెలిపారు. ఈమె మోసాలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలు కోరారు.

ఒంటరి మహిళపై దాడి... దోపిడీ

● మహిళ సహా ముగ్గురు అంతర జిల్లాల దోపిడీ దొంగలు అరెస్టు

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలి దాడి చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకున్న ఓ మహిళ సహా ముగ్గురు అంతర జిల్లాల దోపిడీ దొంగల ముఠాను కొల్లిపర పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రస్తుతం గుంటూరు నగరంలోని బొంగరాల బీడులో నివాసం ఉంటున్న పిడుగురాళ్ల లోని లెనిన్ నగర్ ఏడవ లైనుకు చెందిన కుంచపు దుర్గాప్రసాద్, ఆయన భార్య మున్నంగి ప్రియాంక, ప్రస్తుతం నల్లపాడు లో ఉంటున్న పిడుగురాళ్ల లెనిన్ నగర్ ఏడవ లైనుకు చెందిన కొత్తపల్లి ఎలీషా అనే ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 13 లక్షల ఖరీదైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ సతీష్ కుమార్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. గత నెల 26న కొల్లిపర పోలీస్‌స్టేషన్ పరిధిలోని అత్తోటలో బొల్లి ముంత బుల్లెమ్మ (78) ఇంటిలో నిద్రిస్తుండగా నిందితులు దుర్గాప్రసాద్, ఎలీషా ఆమెపై దాడి చేసి 160 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకున్నారు. పలు ప్రాంతాల్లో సీసీ కెమెరా ఫుటేజీలతో ఈ కేసును త్వరితగతిన చేదించగలిగామన్నారు.

భార్య నుంచి ప్రాణ రక్షణ కల్పించండి

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నా భార్య నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని నగరంలోని కృష్ణనగర్ 1వలైనుకు చెందిన నాయుడు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. బాపట్ల చెందిన తాను, మరో యువతి ప్రేమించుకుని కులాంతర వివాహం చేసుకున్నామన్నారు. తాను డ్రైవరుగా చేస్తున్నానని, అయితే వివాహమైన కొద్ది సంవత్సరాలకు 2017లో తన భార్యకు కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చిందన్నారు. ప్రస్తుతం నాభార్య గుంటూరు నగరంలోని వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ఓ స్టేషన్లో విధులు నిర్వహిస్తుందన్నారు. అయితే కొద్దిరోజులుగా అదేస్టేషన్‌లో పనిచేస్తున్న ఇరువురు కానిస్టేబుల్స్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుందన్నారు. ఈ విషయం తన అత్త ద్వారానే పోలీసు ఉన్నతాధికారులకు తెలియడంతో వారు ఇరువురు కానిస్టేబుల్ పై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారన్నారు. అయితే ఈ విషయం తనకు తెలిసినప్పటి నుంచి తన భార్య తనపై వేధింపులకు పాల్పడుతుందన్నారు. అంతేగాక తనను ఆత్మహత్య చేసుకుని చచ్చిపోవాలని, లేదంటే చంపేస్తానని బెదిరిస్తోందని బాధితుడు ఆందోళన వ్యక్తం చేశారు.

● మీకు సిబిల్ స్కోర్ లేకపోయినా రూ. రెండు వేలు చెల్లిస్తే మూడు లక్షల రుణం ఇప్పిస్తానంటూ ఓ మహిళ విస్తృతంగా ప్రచారం చేసి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడి మోసం చేసిందని ఫిరంగీపురం మండలం 113 తాళ్లూరు కు చెందిన ఓరుగంటి చంద్రలేఖ అనే మహిళ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

హత్యాయత్నం చేసిన కేసును వేరే సీఐకు అప్పగించాలి

ఆస్తికోసం తనపై రెండు దఫాలు హత్యాయత్నం చేసిన కేసు విచారణను తుళ్లూరు- 2 సీఐ అంజయ్య నుంచి తప్పించి మరొక సీఐకి అప్పగించాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది మేరిగ మోహన్ రావు సోమవారం ఎస్పీని ఆశ్రయించారు.

తాగునీటి సరఫరాలో ఆటంకం రాకూడదు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి


పైపులైను పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల కారణంగా తాగునీటి సరఫరాకు ఆటంకం రాకుండా చర్యలు తీసుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారులకు సూచించారు. సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద, నెహ్రూనగర్ పంప్ హౌస్ వద్ద జరుగుతున్న ప్రధాన పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇంటర్ కనెక్షన్ ప్రాంతంలో ఈఈలు, డీఈఈలు పర్యవేక్షణ చేస్తూ, ఫిర్యాదులు వచ్చినప్పుడు వెంటనే ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా అందించాలనేది కూడా ఆమె ఆదేశించారు.

సంస్కరణల పితామహుడు చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌లో అనేక విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్ర దశ, దిశా మార్చిన ఘనత చంద్రబాబు నాయుడికే దక్కుతుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించి 30ఏళ్లయిన సందర్భంగా సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 30 సంవత్సరాల క్రితం తొలి సారి సీఎం గా బాధ్యతలు స్వీకరించి, 4 సార్లు రాష్ట్రానికి పాలన అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక సంస్కరణలు, సంక్షేమ పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు కొత్త దిశ చూపించారన్నారు.

పనులలో ప్రమాణాలు పాటించాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని నెహ్రూనగర్ పంప్ హౌస్, సంజీవయ్య నగర్ రైల్వే గేటు దగ్గర చేపట్టిన త్రాగునీటి పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, వేగంగా చేపట్టి తాగునీటి సరఫరాని పునరుద్ధరించాలని కమిషనర్ శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నెహ్రూనగర్, సంజీవయ్య నగర్ దగ్గర జరుగుతున్న పైప్ లైన్ ఇంటర్ కే కనెక్షన్ పనులను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి

● రేట్ పేయర్స్ అసోసియేషన్

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడం లేదని గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి, సభ్యులు వల్లూరి సదాశివరావు, కనపర్తి రాఘవరావు, రామాల అంజిరెడ్డిలతో సోమవారం కమిషనర్‌ని కలిసి మెమోరాండం అందజేశారు. కార్పొరేషన్ పరిధిలో 62 ఓవర్ హెడ్ ట్యాంక్స్ ఉన్న వాటిలో కొన్ని ట్యాంకులకు పై కప్పులు పూర్తిగా లేవని, మరికొన్ని ట్యాంకులు నిరంతరం కడగటానికి వీలుపడక మురికి పేరుకు పోయింద తెలిపారు. ఇలాంటి కలుషిత నీరు తాగి2018, 2024లో గుంటూరు నగరంలో పదుల సంఖ్యలో ప్రజలు మరణించారని, ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. గుంటూరు నగరంలో ఆస్తిపన్ను విపరీతంగా పెరిగిన నేపథ్యంలో దానికి తగ్గ సౌకర్యాలు కల్పించడంలో నగరపాలక సంస్థ విఫలమవుతోందని త్వరలో గుంటూరు రేట్ పేయర్స్ అసోసియేషన్ సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి గుంటూరు నగరంలోని ప్రధానమైన నీటి సమస్య పై చర్చిస్తామని తెలిపారు

తురకపాలెం గ్రామ ప్రజల్లో ధైర్యం నింపాలి : సీపీఎం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం, తురకపాలెం గ్రామంలో అసాధారణ స్థాయిలో జరుగుతున్న మరణాలతో తీవ్ర భయాందోళనలలో ఉన్న ప్రజల్లో విశ్వాసం కల్పించే విధంగా ప్రభుత్వం, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని సిపియం జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాదిన్నర నుంచి గ్రామంలో మృతుల సంఖ్య గతం కంటే పెరుగుతూ వచ్చిందన్నారు. తక్షణమే ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి రికార్డులను తయారు చేయాలన్నారు. 60 ఏళ్ల లోపు చనిపోయిన వారి కుటుంబాలకు రూ 25 లక్షల పరిహారం ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో ఈమని అప్పారావు, ఎస్ భావన్నారాయణ, ఎన్ నళినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లపై వైసీపీ అసత్య ప్రచారాలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లపై వైసిపి అసత్య ప్రచారాలు చేస్తుందని 15వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు సూరే శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్‌లో జరిగిన పెన్షన్ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. డివిజన్ పరిధిలో ఏ ఒక్క పెన్షన్ తొలగించలేదని స్పష్టం చేశారు. అసత్య ప్రచారాలను నమ్మొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మల్లెంపూడి శ్రీను, వెంకటేశ్వరరావు, మీరావలీ, షాజహాన్, సూరం లక్ష్మి, నాగేశ్వరరావు, సత్తార్, నాని తదితరులు పాల్గొన్నారు.



సభా వేదిక వద్దకు ఓపెన్ టాప్ జీప్‌లో ర్యాలీగా వెళ్తున్న మంత్రులు అనిత, గొట్టిపాటి, ఎమ్మెల్యేలు యరపతినేని, మాధవి తదితరులు

సెప్టెంబరు 1తోనే రాష్ట్రంలో కీలక మార్పు : ఎమ్మెల్యే యరపతినేని

నాయకురాలు నాగమ్మ దగ్గర నుంచే.. మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చే పల్నాడు గడ్డపై.. మరో మహిళా ప్రభంజనాన్ని స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభతో చూస్తున్నానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సెప్టెంబరు 1వ తేదీ తన రాజకీయ జీవితంలో మరుపురాని ఘట్టమన్నారు. ఆగస్టు 21, 1995న వైశ్రాయ్ హోటల్ వద్ద జరిగిన ఘటన నుంచి సెప్టెంబరు 1న చంద్రబాబు మొదటిసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన ఘటన మర్చిపోలేనిదన్నారు. 2013 సెప్టెంబరు 1న పొందుగల వద్ద ఆత్మగౌరవ యాత్రతో రాష్ట్రంలోనే టీడీపీ జెండా రెపరెపలాడేందుకు దోహదపడిందన్నారు. ఆనాడు ఎంతో మంది పార్టీ పెద్దలు చంద్రబాబు పర్యటనకు వెనుకంజ వేసినా.. తాను చూపిన భరోసా పర్యటన ఆసాంతం విజయవంతమైందన్నారు. రాష్ట్రం, రాజధాని ప్రాంత మహిళలపై వైసీపీ నేతలు అసభ్యకర పోస్టులు పెడుతున్నారన్నారు. తల్లిని, చెల్లిని బజారున పెట్టిన జగన్ రాష్ట్రంలో మహిళలకు ఇంకేమి గౌరవం ఇస్తాడని ప్రశ్నించారు. దళిత తేజం, సీమంతం, షష్టిపూర్తి, పసుపు కుంకుమ పెట్టిన విషయాన్ని గుర్తుచేస్తూ సంక్రాంతి నుంచి పిడుగురాళ్లలోని ప్రతి కుటుంబానికి ఒక సిలిండర్‌ను ఉచితంగా అందజేస్తా నని ప్రకటించారు. ఆనాడు ఎన్టీఆర్, ఆ తర్వాత చంద్రబాబు, లోకేశ్ ఇప్పుడు స్త్రీ శక్తి విజయోత్సవ సభ ఒకే వేదికపై జరుగడం మరో విశేషమన్నారు. పురుషులకు దీటుగా సక్సెస్ చేసిన మహిళామణులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యే గల్లా మాధవికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే యరపతినేని

తల్లి, చెల్లి ఉసురుతోనే జగన్ ఓటమి!

(5వ పేజీ తరువాయి)

మీడియాను ఆధారం చేసుకొని మహిళలను అనేక రకాలుగా అవమానించారని ఆవేదన చెందారు. సొంత చెల్లెలు షర్మిలపై కూడా తప్పుడు ప్రచారాలు చేయించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడును 53 రోజులు జైల్లో పెట్టించిన నాడే జగన్ పతనం మొదలైందని మంత్రి అనిత పేర్కొన్నారు. పల్నాడులో వీర నారీమణి నాగమ్మ కత్తితో పోరాటం చేస్తే.. గడిచిన ఎన్నికల్లో ఓటుతో మహిళలు పోరాటం చేశారన్నారు. పల్నాడులోని ప్రతి మహిళ నాగమ్మ అని కితాబిచ్చారు. కొన్ని వేల మందికి పసుపు కుంకుమ కార్యక్రమాలు చేపట్టిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దొరకడం మహిళామణుల అదృష్టమని ప్రశంసించారు.

పిడుగురాళ్ల ఘటనతోనే రాజకీయ అరంగేట్రం: ఎమ్మెల్యే గల్లా మాధవి

పల్నాడు రాజకీయాల్లో ఎమ్మెల్యే యరపతినేనికి సాటి మరెవరూ రారని, ఏ కార్యక్రమం తలపెట్టినా విజయవంతం చేస్తారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. గతంలో పసుపు, కుంకుమ, సీమంతాల కార్యక్రమాలతో ఎన్నో కుటుంబాలకు అన్నగా, పెద్ద కొడుకుగా ఆయన అండగా నిలిచిన ఘటనలు ఎందరో నోట విన్నానని ఆమె గుర్తుచేసుకున్నారు. గత పాలనలో పిడుగురాళ్లలో ఎదురైన ఘటనలతోనే తాను రాజకీయ అరంగేట్రం చేయాల్సి వచ్చిందన్నారు.

అప్పులు చేయకుండానే రాష్ట్రాభివృద్ధి : మంత్రి గొట్టిపాటి

సంపద సృష్టించి.. అప్పులు చేయకుండా.. రాష్ట్రాన్ని అభి వృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేనని.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. అర్హత లేని ఎందరికో.. గత పాలనలో దొంగ పింఛన్లు ఇచ్చారని ఆరోపించారు. అర్హులైన ఏ ఒక్కరి కూడా పింఛన్ పోదని సీఎం చంద్రబాబు స్పష్టం చేసిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి గుర్తుచేశారు. 70శాతానికిపైగా ఆర్టీసీ బస్సుల్లో లక్షలాది మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారన్నారు. విద్యుత్ శాఖలో ఖాళీలను భర్తీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఏ కార్యక్రమం తలపెట్టినా ప్రభంజనం సృష్టిస్తారనేందుకు స్త్రీ శక్తి విజయోత్సవ సభే నిదర్శనమన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు అనిత, గొట్టిపాటి, ఎమ్మెల్యే యరపతినేని, మాజీ ఎమ్మెల్సీలు నన్నపనేని, జంగా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి తదితరులు

ఆత్మగౌరవ యాత్రతోనే టీడీపీ ప్రభంజనం: కొమ్మాలపాటి

సమైక్య నినాదం ఉన్న 2014లో చంద్రబాబు నాయుడు పర్యటన ఎక్కడి నుంచి మొదలుపెట్టాలనే తర్జనభర్జన పడుతున్న సమయంలో గురజాల నుంచే మొదలు పెట్టాలని.. తానే ముందుంటానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు భరోసా ఇచ్చారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గుర్తుచేశారు. దీంతో చంద్రబాబు ఆత్మగౌరవ యాత్ర ప్రారంభించారని తెలిపారు. 30 ఏళ్ల క్రితం సెప్టెంబరు 1న చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మహిళలకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు, దీపం పథకం అమలుతో మహిళలందరూ చంద్రబాబు పక్షాన ఉంటారని కొమ్మాలపాటి పేర్కొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

రిజర్వేషన్ల ఘనత ఎన్టీఆర్‌దే: జంగా కృష్ణమూర్తి

రాష్ట్రంలో మహిళలకు రిజర్వేషన్, ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్‌ది అయితే.. దానిని కొనసాగిస్తున్న చంద్రబాబును రాష్ట్ర మహిళలు మర్చిపోలేరన్నారు. గురజాలలో యరపతినేని తలపెట్టిన ఏ కార్యక్రమం అయినా విజయవంతం కావడానికి ఆయన నిబద్ధత, వెన్నంటి ఉండే వేలాది మంది కార్యకర్తలే కారణమన్నారు.

కష్టకాలంలో పార్టీకి యరపతినేని అండ : నన్నపనేని

పల్నాటి గడ్డపై మరోసారి పల్నాటి పౌరుషాన్ని చూపేలా యరపతినేని స్త్రీశక్తి విజయోత్సవ సభ జరిపారని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న ఒకానొక దశలో పల్నాడులో టీడీపీకి, కార్యకర్తలకు అండగా ఉన్న యరపతినేని అంటే చంద్రబాబుకు ఎంతో ఇష్టమన్నారు. చంద్రబాబుపైనే కాకుండా టీడీపీ నేతలపై అనేక అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టించిన జగన్‌ను రాష్ట్ర ప్రజలు చాచి లెంపకాయ కొట్టారన్నారు. ఎన్నడూ బయటకు రాని భువనేశ్వరి పిలుపుతో రాష్ట్రంలోని లక్షలాది మంది మహిళలు రోడ్డెక్కారని గుర్తుచేశారు. ఒక చేత్తో ఓటు వేస్తూ.. మరో చేత్తో జగన్‌కు బైబై చెప్పారన్నారు. పిడుగురాళ్లలో ఒకే వేదికపై మూడు తరాల నేతలతో సభలు పెట్టి సక్సెస్ అయిన ఘనత యరపతినేనికే దక్కిందన్నారు.



వీవీఐటీలో 'అందెల రవమిది' బృందం సందడి

పెదకాకాని, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వీవీఐటీ వర్సిటీలో అందెల రవమిది చిత్ర బృందం సోమవారం సందడి చేసింది. సంప్రదాయ నృత్య కళలను బతికించుకోవాలని, ప్రపంచానికి చాటి చెప్పాలన్న ప్రయత్నంతో ప్రముఖ నృత్య కళాకారిణి అభినయశ్రీ ఇంద్రాణి దావులూరి ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రం త్వరలో అమెజాన్ ప్రైమ్ వీడియోస్‌లో విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమంలో భాగంగా వీవీఐటీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. నటి ఇంద్రాణి, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రం అన్ని వర్గాల వారిని అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంప్రదాయ కళలను ఆదరించి.. కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

వర్సిటీలో విద్యార్థినులతో కలిసి ప్రముఖ నృత్య కళాకారిణి అభినయశ్రీ ఇంద్రాణి నృత్యం

వంతెన తాకేలా.. కృష్ణమ్మ పరవళ్లు

దాచేపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ డ్యాం నుంచి విడుదలైన వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తూ లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. మండలంలోని తంగెడ గ్రామ సమీపంలోని వంతెన అంచులను తాకేలా.. కృష్ణవేణి పరుగులు తీస్తోంది. పల్లె కారులు చేపల వేటను వాయిదా వేసుకున్నారు. రామాపురం, పొందుగల, కాట్రపాడు, భట్రుపాలెం గ్రామాల్లోని రేవుల వద్ద నదిలోకి వేటకు వెళ్ల వద్దని అధికారులు ఆదేశించారు.





లీప్ స్కూల్ ప్రధాన భవనసముదాయం (ఏ బ్లాకు)

ఏపీ విద్యా ప్రతిష్ట..'లీప్'!

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రానికి సమున్నత గౌరవాన్ని ఆపాదిస్తుంది. ఈ లీప్ పాఠశాలలను రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి వంతున ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకు తొలి పైలెట్ ప్రాజెక్టుగా తన సొంత నియోజకవర్గం మంగళగిరిలో లీప్ పాఠశాలను ఏర్పాటు చేయిస్తున్నారు. అలాగే రాజధాని గ్రామాల్లో ఒకటైన నిడమర్రులో లీప్ పాఠశాలను ఈ విద్యా సంవత్సరం నుంచే ఆరంభిస్తున్నారు. సుమారు రూ.15 కోట్ల వ్యయంతో నిడమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలను లీప్ స్కూల్‌గా అభివృద్ధి చేస్తున్నారు.

లీప్ స్కూల్స్...ఎందుకంటే!

రాష్ట్రంలో పాఠశాల విద్యను 2029-30 విద్యా సంవత్సరం నాటికి పూర్తిగా బలోపేతం చేయాలన్నదే లక్ష్యంగా లీప్ పాఠశాలల వ్యవస్థను మంత్రి లోకేశ్ తీసుకువస్తున్నారు. ఇది ఆట ఆధారిత అభ్యాసం, డిజిటల్ అక్షరాస్యత, 21వ శతాబ్దపు నైపుణ్యాలను కలుపుతూ ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రాన్ని విద్యార్థుల్లో పెంపొందించడానికి రూపొందించిన.. ఫలిత ఆధారిత వ్యూహమని చెప్పుకోవాలి. ఈ విధానంలో విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంచుకుని నిజ జీవిత నైపుణ్యాలను బలంగా మెరుగుపరుచుకుంటారు. అంటే కేవలం విద్యా పరంగానే కాకుండా భవిష్యత్తుకు సంసిద్ధులై ఉంటారు. ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయంగా తగ్గిపోతున్న హాజరు శాతాన్ని వేగంగా పెంచేందుకు లీప్ స్కూల్ వ్యవస్థ తోడ్పడుతుంది. డ్రాప్ అవుట్స్‌లో 95 శాతం మందిని తిరిగి పాఠశాలలకు చేర్చి... ప్రవేశాలను మెరుగుపరుచుకోవడం దీని ప్రధాన లక్ష్యంగా చెబుతున్నారు. లీప్ పాఠశాలల్లో పాఠ్యాంశాలన్నీ 2020 జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఉంటాయి. తద్వారా పరిశోధన, ఆవిష్కరణ అవకాశాలకు ఊతమిస్తుంది. సృజనాత్మక ఆలోచన, వ్యవస్థాపకతను విద్యార్థుల్లో ప్రోత్సహిస్తుంది. ఆరు, తొమ్మిదవ తరగతి విద్యార్థు కోసం బ్రిడ్జి కోర్సులను కూడా అందిస్తారు.



నిడమర్రులోని లీప్ స్కూల్ ప్రధాన ద్వారం



ఓపెన్ యాంఫీ థియేటర్

రాష్ట్రంలో తొలి మోడల్ స్కూల్..

రాష్ట్రంలో తొలి లీప్ మోడల్ స్కూల్‌గా నిడమర్రు జడ్పీ ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దనున్నారు. ఇది నిడమర్రు - కురగల్లు గ్రామాల మధ్య సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో ఉంది. నాలుగేళ్ల క్రితం ఇంటర్మీడియెట్ విద్యను ఇక్కడ అందుబాటులోకి తెచ్చారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇక్కడ బోధన జరుగుతుంది. పదవ తరగతి విద్యార్థులు 70 మంది, జూనియర్ ఇంటర్‌లో 22 మంది (ఎంపీసీ), సీనియర్ ఇంటర్‌లో ఎనిమిదిమంది (ఎంపీసీ, బైపీసీ) విద్యార్థులున్నారు. ఇక ఒకటి నుంచి తొమ్మిదవ తరగతి వరకు 420 మంది విద్యనభ్యసిస్తున్నారు. దీంతో ఈ విద్యాలయాన్ని మోడల్ ప్రాజెక్టుగా మంత్రి నారా లోకేశ్ ఎంచుకున్నారు.

రూ.15 కోట్లతో..అత్యాధునిక సౌకర్యాలు

రూ.15 కోట్లకు పైగా వ్యయంతో నిడమర్రు జడ్పీ హైస్కూల్‌ను లీప్ స్కూల్‌గా అభివృద్ధి చేస్తున్నారు. దీనికి సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచే పనులు ప్రారంభించి.. శరవేగంగా పూర్తి చేస్తున్నారు. గత వేసవి సెలవుల్లో రోజుకు రెండొందల మంది కార్మికుల వంతున నిత్యం పని చేశారు. ఇందులో ఏ బ్లాకు పేరిట ప్రధాన భవన నిర్మాణాన్ని జీ ప్లస్ వన్ భవన సముదాయంగా యు ఆకృతిలో నిర్మించారు. ఇందులో మొత్తం 29 తరగతి గదులు ఉన్నాయి. మొత్తం ప్రాంగణంలో తూర్పు వైపున బీ బ్లాకు పేరుతో మరో 12 తరగతి గదుల భవనాన్ని నిర్మించారు. దీని పక్కనే సీ బ్లాకు పేరుతో మరో చిన్న భవనాన్ని నిర్మించి దానిని డైనింగ్ హాలుకు కేటాయించారు. ఇండోర్ గేమ్స్ ఆడుకునేందుకు ఓపెన్ థియేటర్‌ను అధునాతనంగా ఏర్పాటు చేశారు. దీని పక్కనే స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేశారు. 33 సెంట్ల విస్తీర్ణంలో ఓ సైన్స్ పార్కును కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇంకో అరెకరం విస్తీర్ణంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం కిడ్స్ ప్లే గ్రౌండ్‌ను ఏర్పాటు చేసి, టాయ్‌లెట్లను నిర్మిస్తున్నారు. ఇక పాఠశాల ప్రధాన ద్వారానికి దక్షిణంగా 600 సీటింగ్ సామర్థ్యం గల ఓపెన్ యాంఫీ థియేటర్‌ను సరికొత్తగా నిర్మిస్తున్నారు. పాఠశాల మధ్యలో 200 మీటర్ల వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తూ.. దాని నుంచి వర్షపు నీటిని బయటకు పంపేందుకు ప్రత్యేక డ్రెయినేజీ వ్యవస్థను నిర్మిస్తున్నారు. వీటి సమీపంలోనే ఖోఖో, వాలీబాల్, ఫుట్ బాల్ కోర్టులను తీర్చిదిద్దుతున్నారు. ఈ పనులన్నీ ఈ నెలాఖరులోగా పూర్తవ్వొచ్చని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.





అమరావతి : నిమజ్జనానికి బారులు దీరిన గణనాథులు

వెళ్లిరావయ్య..గణపయ్య..!

వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. గణేశ్ ప్రతిమల నిమజ్జనాలతో.. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా సందడి నెలకొంది. భక్తులు రంగులు చల్లుకుంటూ.. నృత్యాలు చేస్తూ లంబోదరుడి ఊరేగింపులో ముందుకు సాగారు. భక్తిపారవశ్యంతో జై బోలో గణేశ్ మహరాజ్‌కి.. జై అంటూ నినాదాలు చేశారు. మళ్లీ రావయ్యా గణపయ్య అంటూ నిర్దేశించిన కాల్వల వద్ద విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేశారు.

– ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్





అమరావతి : వివిధ అలంకరణలో ఉన్న భారీ గణనాథులు







అమరావతి : నిమజ్జనం చేస్తున్న భక్తులు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వట్టిచెరుకూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం 11 గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీపీ చిలకా రాజ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులకు సమాచారం ఇవ్వటం జరిగిందని, అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



ది రెడ్ బుక్ ఆఫ్ ఇన్‌స్పిరేషన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌ఆర్‌ఎం ప్రతినిధులు

ఎస్‌ఆర్‌ఎంలో ఎంటర్‌ప్రిన్యూర్, సీఎస్‌ఆర్ సమ్మిట్

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో రెండు రోజులపాటు గ్లోబల్ సోషల్ ఎంటర్‌ప్రిన్యూర్ అండ్ సీఎస్‌ఆర్ సమ్మిట్ జరిగింది. దేశ వ్యాప్తంగా వున్న వివిధ కంపెనీల పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, విద్యావేత్తలు, పలువురు పెట్టుబడిదారులు సదస్సుకు హాజరయ్యారు. యూనివర్సిటీ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రిన్యూర్ డైరెక్టర్ సిద్ధార్థ త్రిపాఠి సదస్సును ప్రారంభించి సమ్మిట్ ఉద్దేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా గ్రామీణ మహిళల వృత్తి శిక్షణకు సంబంధించిన ది రెడ్ బుక్ ఆఫ్ ఇన్‌స్పిరేషన్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

వారంపాటు రైల్వే గేటు మూసివేత

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అత్యవసర ట్రాక్ మరమ్మతుల కోసం తాడేపల్లి మంగళగిరి విజయవాడ కృష్ణా కెనాల్ స్టేషన్ల మధ్య అనుసంధానించే ఎల్‌సి గేట్ నెం.310కెఎం 424/12-14 వద్ద అత్యవసర రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని రైల్వే అధికారులు సంకల్పించారు. దాంతో ఎల్‌సి గేట్‌ను మంగళవారం ఉదయం 7 గంటల నుండి 8వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటల వరకు వారం రోజులపాటు మూసి వేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ సెక్షన్ ఇంజనీరింగ్ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది.

ఓట్ల చోరీపై నిగ్గు తేల్చాలి..

తాడేపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఓటు చోరీపై నిగ్గు తేల్చాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి సీపీఐ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ సీపీఐ నేత బుర్రముక్కు సర్వారెడ్డి 11వ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సభకు సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్లి వెంకటయ్య అధ్యక్షత వహించారు. తిరుపతయ్య మాట్లాడుతూ ఓటు చోరీ చేయడం అనేది రాజ్యాంగాన్ని ఖూనీ చేయడమేనని చెప్పారు. విద్యుత్ సంస్కరణల పేరుతో స్మార్ట్ మీటర్లు బిగిస్తూ సామాన్య ప్రజలపై పెనుభారాలు మోపుతున్నారని మండిపడ్డారు.

రైతు సమస్యలను విస్మరించిన కేంద్రం

తాడేపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతుల సమస్యలను విస్మరించిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. సోమవారం రైతాంగం కోరికల దినోత్సవం సందర్భంగా తాడేపల్లి మండలం పెనుమాకలోని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఎదుట ఏఐకెఎస్ జెండాను రైతు సంఘం నాయకులతో కలిసి ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ఈ 11 ఏళ్ల కాలంలో లక్షా 50వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. నేటి నుండి 3 వ తేదీ వరకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున రైతు సంఘాలు అన్ని కలిపి సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని సెప్టెంబర్ 8వ తేదీన అన్ని మండల కేంద్రాలలో రైతుసంఘాలు ఆందోళన నిర్వహిస్తామన్నారు.

చలపతి అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం

తాడికొండ(లాం), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న తిప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డికి నేషనల్ ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ పాట్నా(బీహార్) పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసరెడ్డి నీటి అడుగున శబ్దసెన్సార్ నెట్వర్క్, స్థితిస్థాపక స్థానికీకరణ వ్యూహాలపై పరిశోధనలు చేశారు. పీహెచ్‌డీ పట్టా పొందిన ఏ. శ్రీనివాసరెడ్డిని చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, సెక్రటరీ వై.సుజిత్‌కుమార్, డాక్టర్ కేవీ రామారావు అభినందించారు.

19న చలో విజయవాడ జయప్రదం చేయాలి

● సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు రవి

తుళ్లూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 19న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి పిలుపునిచ్చారు. సోమవారం డాక్టర్ అంబేద్కర్ ఆటోవర్కర్స్ యూనియన్ సమావేశంలో రవి మాట్లాడుతూ, సీఐటీయూ అఖిల భారత మహాసభల సందర్భంగా జనవరి 4న విశాఖపట్నంలో జరిగే కార్మిక మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఆటో రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్న జీవో నెంబర్ 21ని రద్దు చేయాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన నేపథ్యంలో నష్టపోతున్న ఆటో డ్రైవర్లందరికీ వాహనమిత్ర ద్వారా రూ.25వేలు వెంటనే అందజేయాలనికోరారు. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని అన్నారు. ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జెట్టి నరేష్ మాట్లాడుతూ ఓలా, ఉబర్, రాపిడో యాప్స్ ను రద్దుచేసి ప్రభుత్వమే యాప్స్‌ను నిర్వహించాలని కోరారు.సమావేశంలో ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీను, కాశయ్య, నాగరాజు, తులసిబాబు పాల్గొన్నారు.

కోలాహలంగా నిమజ్జనోత్సవాలు

తుళ్లూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కోలహలంగా వినాయకుని నిమజ్జనోత్సవాలు మండలంలో సోమవారం జరిగాయి. తుళ్లూరులో ఎక్సైజ్ సెంటర్ వినాయకుడి నిమజ్జనోత్సవంలో మహిళల కోలాటం, యువతుల ఆధ్యాత్మిక నృత్య ప్రదర్శన, పురుషుల కనక తప్పెట్ల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. తూర్పు బజారు వినాయకుడు, ఐనచెరువు వినాయకుడిని యువకులు కోలాహలంగా ఊరేగించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సెంటర్ విఘ్నేశ్వర కమిటి అన్నదానం నిర్వహించింది. గణనాధుల ఊరేగింపులో ప్రసాదాలను పంపిణీ చేశారు.

స్వర్ణ గణపతి లడ్డూ రూ.లక్షా 80 వేలు

మంగళగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి షరాబ్ బజారులో లక్ష్మీ నరసింహ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వర్ణ గణపతి విగ్రహం వద్ద లడ్డూ వేలం పాటను ఆదివారం రాత్రి నిర్వహించారు. మంగళగిరి పట్టణానికి చెందిన బల్లా వెంకట రమణ, బట్టు నారాయణ, వుడతా ప్రసాద్, చింతక్రింది శ్రీనివాస ఉమామహేశ్వరరావులు రూ.లక్షా 80 వేల 516లకు లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూను దక్కించుకున్న భక్తులను కమిటీ ప్రతినిధులు స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించారు.



వట్టిచెరుకూరు మండలం యామర్తి గ్రామంలో పూజలందుకుంటున్న వినాయకుడు



స్వర్ణ గణపతి లడ్డూను దక్కించుకున్న భక్తులు

మొదటి గంటలోనే పెన్షన్ పంపిణీ

● ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్



మేడికొండూరు: సరిపూడిలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తదితరులు

మేడికొండూరు సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ప్రతి నెల ఒకటో తారీఖున మొదటి గంటలోనే ఎక్కువ శాతం పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్ చెప్పారు. మేడికొండూరు మండలం సిరిపురం, సరిపూడి, ఎలవర్తిపాడు గ్రామాలలో సోమవారం పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి గంటలోనే పెన్షన్ అందుతుండడంతో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.11కోట్ల పెన్షన్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

ఉదయం ఆరు గంటలకే పింఛన్ పంపిణీ

తుళ్లూరు, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ఉదయం ఆరు గంటలకే అధికారులు ఇళ్లకు వచ్చి సామాజిక పింఛన్ల నగదును అందజేశారు. మండలంలో 95 శాతంపెన్షన్ల పంపిణీని పూర్తి చేశారు. మిగిలిన వారికి మంగళవారం అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమ పథకాల అందజేస్తున్న విషయంలో వైసీపీ కుట్రలు పన్నుతుందని ధ్వజమెత్తారు. ఆ ప్రభుత్వంలో వికలాంగుల దొంగ సర్టిఫికెట్లు పెట్టి పించన్ పొందారని, దానిని కూటమి ప్రభుత్వం సరిచేసి, నిజమైన బాధితులకు పించన్ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. తుళ్లూరులో జరిగిన పించన్ల పంపిణీ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ జమ్ముల అనిల్ కుమార్, తాడికొండ నియోజకవర్గ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చందు, బూత్ ఇన్‌చార్జ్ గూడపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

● మంగళగిరి: మంగళగిరి పట్టణంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ జరిగింది. సచివాలయ సిబ్బందితోపాటు ఎంటీఎంసీ అధికారులు, టీడీపీ నాయకులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, డయాలసిస్ పేషెంట్స్, అనారోగ్యంతో మంచాన పడిన వారికి రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.పది వేలు, రూ.15 వేల చొప్పున పింఛన్లు అందుతున్నాయని చెప్పారు.

● అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న ఓ మహిళకు సచివాలయ సిబ్బంది సకాలంలో పింఛన్ అందజేసి ఆర్థిక భరోసా కల్పించారు. మంగళగిరి పట్టణం 16వ సచివాలయ పరిధిలో నివాసం వుంటున్న కోరమట్ల మల్లేశ్వరి అనారోగ్యంతో మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఒకటో తేదీ కావడంతో మహిళా పోలీసు ఉద్యోగిని టీ.దివ్యవేణి ఆసుపత్రికి సైతం వెళ్లి అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న మల్లేశ్వరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేశారు. ఆసుపత్రికి సైతం వచ్చి పింఛన్ అందించడం పట్ల బాధితురాలి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

● పెదనందిపాడు: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీ 90.87శాతం పూర్తి అయినట్లు ఎంపీడీవో లక్ష్మీదేవి తెలిపారు. 17గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లను 6,640 గాను 6034మందికి పంపిణీ చేసినట్లు, మిగిలిన వారికి మంగళవారం అందజేయనున్నట్లు తెలిపారు.

కష్టపడి పనిచేసిన వారికే పదవులు



యడ్లపల్లి సాంబశివరావును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

తాడికొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి పదవులు దక్కుతాయని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్‌గా ఎన్నికైన యడ్లపల్లి సాంబశివరావును తాడికొండ మండలం దామరపల్లి గ్రామ టీడీపీ నాయకులైన గడ్డిపాటి సాంబశివరావు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ మోతడక పంచాయతీ, ఎంపీటీసీ, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి మెజారిటి రావటానికి ఎంతో కృషి చేశారన్నారు. సాంబశివరావు 30 ఏళ్లుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని పనిచేశారన్నారు. రాష్ట్ర ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డ్ డైరెక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ తనకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంతి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి గుంటుపల్లి మధుసూదనరావు, ఎంపీటీసీ తాటి తులసీరామ్, టీడీపీ సీనియర్ నాయకులు వెలగల రంగరావు, మాదల శ్రీకాంత్, అల్లూరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన ఎన్ఆర్ఐ విద్యార్థులు

మేడికొండూరు సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు సమీపంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో షాగరోస్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పలువురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డి.సంజయ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో షాగరోస్ కంపెనీ హెచ్ ఆర్ తులసి, మహేష్, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ విభాగాధిపతి జి నరేష్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగానికి చెందిన వై పవన్‌సాయి, ఐ జయ సాయి కృష్ణ లు ఎన్నికైనట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగానికి చెందిన మౌలాలి, జీవన తదితరులు పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు విద్యార్థులను అభినందించారు.

ఇంటింటికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

తాడికొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ నూతనంగా తీసుకువచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ తాడికొండ మండలంలో సోమవారం ప్రారంభమైంది. తాడికొండ మండలంలోని గ్రామాల్లో ఆయా రేషన్ డీలర్లు, అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మండల పరిధిలో 46 రేషన్ షాపులు ఉండగా 22,575 రేషన్ కార్డులు దారులు ఉన్నారు. ఇప్పటికే ఆయా సచివాలయలకు స్మార్ట్ రేషన్ కార్డులు చేరుకున్నాయి. దీంతో రేషన్ డీలర్లు ఇంటింటికి వెళ్లి కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు మాల్యాద్రి, బ్రహ్మయ్య, టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు ఆలపాటి బాలయ్య, తాడికొండ సొసైటీ అధ్యక్షుడు గోగినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● ఫిరంగిపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రైస్ కార్డులను తహసీల్దార్ జే ప్రసాదరావు సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని కండ్రిక గ్రామంలో కార్డులను పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ మండలంలో 42 చౌక డిపోలు ఉన్నాయని, వాటిలో మొత్తం 20,382 పాత కార్డుల స్థానంలో నూతనంగా స్మార్ట్ రైస్ కార్డులు వచ్చాయని, వాటిని ఊరూర పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మండవ నరసింహారావు, సర్పంచ్ నలజర్ల అప్పయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ జీ.సురేష్‌బాబు తెలిపారు. టిప్పర్ల బజారు, మార్కండేయ కాలనీ, మన్నెం వారి వీధి, రాయల్ కన్వెన్షన్, ఎల్బీ నగర్, మైలార్ నగర్, ద్వారకా నగర్, ఆంజనేయ కాలనీ, బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టుశిక్షణ దోహదం

పెదనందిపాడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థికాభివృద్ధి మెరుగుపరుచుకునేందుకు కుట్టు శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని పీఏఎస్ కళాశాల ప్రిన్సిపాల్ జీ వీరరాఘవయ్య అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) సహకారంతో గత నెలరోజులుగా నిర్వహించిన కుట్టు శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రంలో మహిళలతో పాటు నిరుద్యోగులకు, పేదలకు దాతల సహకారంతో ఎన్నో సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాలకు ప్రత్యేకంగా తోడ్పాటునందిస్తున్న నాట్స్ పూర్వపు అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకులు దొప్పలపూడి రమేష్‌బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, మర్రి లక్ష్మీ, పి భువనేశ్వరి, పోపూరి సుధీర్, కుట్టు శిక్షకులు కొర్రపాటి లక్ష్మీ, ముబీనా, లక్ష్మీ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సత్తా చూపిన ప్రకాశం జిల్లా ఎడ్లు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారకరామారావు మెమోరియల్ ఎడ్ల బండలాగుడు పోటీలు గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో నాలుగు రోజులుగా రసవత్తరంగా జరుగుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ఎడ్ల జతలు ఈ పోటీలలో పోటీ పడ్డాయి. సోమవారం న్యూకేటగిరి విభాగంలో జరిగిన పోటీలలో 15 జతలు బరిలో నిలిచాయి. అందులో ప్రకాశం జిల్లా ముప్పాళ్ళ మండలం మద్దిరాలకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత 4350 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 3301.9 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజియ్యచౌదరి ఎడ్లు 3651.4 అడుగుల దూరం లాగి మూడోస్థానంలో నిలిచాయి. గెలుపొందిన విజేతలకు కమిటీ నగదు బహుమతులు మెమొంటోలను అందజేశారు.



ప్రథమస్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లా మద్దిరాల ఎడ్ల జత

రూ.15 లక్షల విలువైన ఎల్‌వోసీ చెక్కు అందజేత



ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో మంగళగిరికి చెందిన ఓ మహిళకు రూ.15 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ చెక్కు మంజూరైంది. మంగళగిరి మండలం చినకాకాని గ్రామానికి చెందిన గడ్డిపాటి తులసీ హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆసుపత్రిలో గత కొంత కాలంగా చికిత్స పొందుతున్నారు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత సరిపోకపోవడంతో స్థానిక నాయకులు వారి ఆర్థిక ఇబ్బందులను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన లోకేశ్ సీఎం చంద్రబాబుతో మాట్లాడి తులసీ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 లక్షలు మంజూరు చేయించారు. స్థానిక నాయకులు సోమవారం చినకాకానిలోని తులసీ నివాసానికి వెళ్లి ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని అందజేశారు. ఎల్‌వోసీ మంజూరుకు కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాడి రైతులకు బోనస్ అందజేత

ప్రత్తిపాడు,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే సంగం డెయిరీ ధ్యేయమని డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాతమల్లాయపాలెం, పెదగొట్టిపాడు, గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ కార్యాలయాల్లో సోమవారం పాలరైతులకు బోనస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణచైతన్య, పాలకవర్గసభ్యులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

వారం రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రత్తిపాడులోని 220 కెవీ సబ్ స్టేషన్‌లో జరుగుతున్న పనుల కారణంగా వారం రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతాయని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవి తెలిపారు. ఈ నెల 9వ తేది వరకు మరమ్మతులు జరుగుతున్నన అనివార్య పరిస్థితుల్లో డివిజన్‌లో విద్యుత్ సరఫరా అంతరాయాలకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

మారీసుపేటలో ట్రాఫిక్ జామ్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాలలో మారీసుపేట పాత బస్టాండ్ దగ్గర సోమవారం కొంతసేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. గణేష్ నిమజ్జనం కోసం డిజే సౌండ్ సిస్టమ్ తీసుకు వెళ్లే వాహనం బ్రిడ్జి వద్ద మొరాయించింది. ఫుట్‌పాత్‌కు డివైడర్‌కు మధ్య వాహనం ఆగిపోవడంతో కొంతసేపు శ్రమించాల్సి వచ్చింది. ఈ సమయంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జియావుల్ హక్

పీజీఆర్ఎస్‌కు ఏడు అర్జీలు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీ ఆర్ ఎస్‌కు ఏడు అర్జీలు దాఖలైనట్లు తహశీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఐదు అర్జీలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమస్యపై 1, భూమి సర్వే కోసం 1 దరఖాస్తు అందాయి. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండు వేలు చెల్లిస్తే మూడు లక్షలు
రుణం ఇప్పిస్తానంటూ మోసం

● లక్షలు వసూలు చేసినట్లు

బాధితురాలు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మీకు సిబిల్ స్కోర్ లేకపోయినా రూ. రెండు వేలు చెల్లిస్తే మూడు లక్షల రుణం ఇప్పిస్తానంటూ ఓ మహిళ విస్తృతంగా ప్రచారం చేసి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడి మోసం చేసిందని ఫిరంగీపురం మండలం 113 తాళ్లూరుకు చెందిన ఓరుగంటి చంద్రలేఖ అనే మహిళ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాను గతంలో నెట్వర్క్ మార్కెటింగ్ లో పనిచేసినప్పుడు వారి ద్వారా నగరంలోని సంగడిగుంట రెడ్ల బజారుకు చెందిన జక్కిరెడ్డి రాధా అనే మహిళ పరిచయమైందన్నారు. ఆమె ధనలక్ష్మి ఫైనాన్స్ ద్వారా రెండు వేలు వసూలు చేస్తే వారికి మూడు లక్షలు రుణం ఇప్పిస్తానని చెప్పడంతో తాను విజయవాడతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న తనకు తెలిసిన వారు, బంధువు నుంచి 12లక్షలు కట్టించానని, అదేవిధంగా తన వద్ద ఉన్న 13 లక్షలు కూడా కట్టినట్టు తెలిపారు. మొత్తం 25 లక్షలు చెల్లించానన్నారు. వెయ్యి మంది సభ్యులు టార్గెట్ అని, ఆ తర్వాతే రుణాలు వస్తాయని చెప్పి పది నెలలుగా తమ నుంచి వసూలు చేసింది అన్నారు. సుమారు 600 మంది వరకు బాధితులు ఉంటారన్నారు. అయితే నిందితురాలు ఎటువంటి రుణం ఇవ్వకపోగా బెదిరిస్తోందన్నారు. ఇదిలా ఉంటే తాను డబ్బు కట్టించిన సభ్యులు కొంతమంది గత నెల 19న తన భర్తను 113 తాళ్లూరు నుంచి కిడ్నాప్ చేసి విజయవాడ తీసుకువెళ్లి హింసించారన్నారు. నీ భార్యను అప్పగిస్తేనే నిన్ను విడుదల చేస్తామని బెదిరించారన్నారు. దీంతో తాను ఫిరంగిపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితులకు ఫోన్ చేసి బెదిరించడంతో వారు తన భర్తను విజయవాడలోని కమీషనర్ కార్యాలయం వద్ద వదిలి వెళ్ళిపోయారు అన్నారు. దీనిపై ఫిరంగీపురం పోలీస్ స్టేషన్లో కిడ్నాప్ కేసు నమోదు అయిందన్నారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

ఆబాల గోపాలాన్ని అలరించిన
పౌరాణిక ఏకపాత్ర పోటీలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డు, శ్రీ అన్నదాన సమాజం ఆడిటోరియంలో భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పౌరాణిక ఏకపాత్ర పోటీలు అలరించాయి. రాష్ట్ర నలుమూలల నుంచి 60 మంది ప్రముఖ రంగ స్థల కళాకారులు పాల్గొని, తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులచే ప్రశంసలు పొందారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ రంగస్థల నటుడు యల్లాప్రగడ వెంకట సుబ్బారావు, రచయిత్రి తుమ్మల స్నిగ్ధ మాధవి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఏపి ఫైనాన్షియల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ వడ్రాణం మార్కండేయ బాబు, అఖిల భారత పంచాయితీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, జనసేన నాయకులు మిరియాల గోపీ కుమార్, డేగల వెంకటేశ్వరరావు, మాతృశ్రీ విద్యా సంస్థల డైరెక్టర్ బండ్లమూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

దూరదృష్టి గల నేత చంద్రబాబు


కొల్లిపరలో పెన్షన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): దూరదృష్టిగల నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కొనియాడారు. సోమవారం కొల్లిపరలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి పెన్షన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 62లక్షల మందికి కూటమి ప్రభుత్వం వివిధ రకాల పెన్షన్ ఇవ్వడం చాలా గొప్ప విషయమన్నారు. భారత దేశంలో పేదవారి యొక్క సంక్షేమం గురించి ఆలోచించిన ఏకైక ప్రభుత్వం చంద్రబాబునాయుడు ప్రభుత్వమేనని తెలియజేశారు. కూటమి నాయకత్వంలో ఎదైతే ఎన్నికల్లో హామీ ఇచ్చిందో దాదాపు అందరిని సంతృప్తి పర్చినట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటి రెడ్డి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, నాయకులు ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, కంచర్ల అమృతరాజు, భీమవరపు లంకకోటి రెడ్డి, కొరారు అంజనేయులు, దాసరి నరసయ్య, ఆరిమండ వెంకటరెడ్డి, షేక్ రఫీ, కాకి చంటి, చాగంటి నారాయణరెడ్డి, కేసన పోతురాజు, నక్కా సంసోన్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి రూరల్ గ్రామాల్లో..

తెనాలి అర్బన్ : తెనాలి రూరల్ గ్రామల్లోనూ ఆయన పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పెన్షన్, సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం ధృడ చిత్తంతో వ్యవహరిస్తుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు బురద చల్లే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు.

టీడీపీ నేత కుటుంబానికి పరామర్శ

ఐతానగర్‌లో మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కన్నెగంటి వెంకట్రావు భౌతికకాయాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

కొలకలూరులో పెన్షన్ల పంపిణీ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెనాలి రూరల్ మండలం కొలకలూరులో శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్ పించన్లు పంపిణీ చేశారు. సోమవారం గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి చేతివృత్తిదారుల సమస్యలు తెలుసుకున్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనాలు


మంత్రి మనోహర్‌ను సత్కరిస్తున్న వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు


కొలకలూరులో ఊరేగుతున్న గణేషుడు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గణేష్ నిమజ్జనాలతో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాధులను నిమజ్జనం చేసేందుకు, పట్టణ, రూరల్ గ్రామాల్లో సోమవారం ఘనంగా ఊరేగించారు. సంగం జాగర్లమూడిలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వినాయక పూజల్లో పాల్గొన్నారు. ఆయనను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కొలకలూరు బీసీ కాలనీలో కులమతాలకు అతీతంగా వినాయక ఉత్సవాలు నిర్వహించారు. గణనాధుని ఊరేగించి నిమజ్జనం చేశారు. గమిడి రామకృష్ణ, కుమార్‌రాజా, సురేష్, గోపి, అవినాష్, మణిదీప్ పాల్గొన్నారు. నందులపేట దేవినేని వెంకయ్య వీధిలో యువ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో లడ్డూ వేలం జరిపారు. కోడెల ప్రణవ్ రూ.లక్షా 10 వేల 116లకు దక్కించుకున్నాడు. ఆదివారం రాత్రి 12 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాలు గణేష్ నిమజ్జన కార్యక్రమాలతో మార్మోగాయి.

గ్రామాల్లో వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు

కొల్లిపర, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర మండలంలోని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మున్నంగి, కొల్లిపర, తూములూరు, దావులూరు, అత్తోట గ్రామాల్లో గణనాథుడిని వివిధ రూపాల్లో అలంకరించి పండితులు పూజలు చేశారు. పలు గ్రామాల్లో భక్తులు అన్నదానం నిర్వహించారు. వల్లభాపురం, మున్నంగి, తూములూరు, చక్రాయపాలెం, కొల్లిపర తదితర గ్రామాల్లో కొంత మంది భక్తులు వినాయక విగ్రహాలకు పూజలు చేసిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాలతో, కనక తప్పెట్లుతో ఊరేగింపు నిర్వహించి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

కొనసాగుతున్న గణనాథుల నిమజ్జనాలు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో సోమవారం గణనాథుల నిమజ్జనాలు కొనసాగాయి. మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో వినాయక ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో కొలువుతీరిన గణనాథుడి నిమజ్జనం అట్టహాసంగా జరిగింది. సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనంపై గణనాథుడిని ప్రతిష్ఠించి గ్రామోత్సవాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల కోలాట ప్రదర్శన, సంప్రదాయ చెక్క భజనలు గ్రామస్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. అలాగే వీవర్స్ కాలనీలో కొలువుదీరిన గణనాథుడి నిమజ్జనం కూడా ఘనంగా జరిగింది. పొన్నూరు పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు చేబ్రోలు మండలంలో పలు గ్రామాల్లో కొలువుదీరిన గణనాధుల నిమజ్జనం వైభవంగా నిర్వహించారు.


తెనాలి: నందులపేటలో లడ్డూ వేలంలో పాల్గొన్న యువకులు


కొల్లిపర: మున్నంగిలో వినాయక విగ్రహం ఊరేగింపులో భక్తులు


పొన్నూరు: నిమజ్జనానికి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై తరలి వెళుతున్న చింతలపూడి గణనాథుడు

ఆదివాసి, దళితుల ఆత్మగౌరవ పోరాటాలు బలోపేతం చేద్దాం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): దళిత, ఆదివాసీల ఆత్మగౌరవ పోరాటాలు బలోపేతం చేద్దామని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె కృష్ణ అన్నారు. పట్టణంలోని మానవ హక్కుల వేదిక కార్యాలయంలో సోమవారం మన్నం ప్రసాద్ 20వ సంస్మరణ సభ కరపత్రాలను ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ పౌర హక్కులసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ రాజారావు మాట్లాడుతూ 79 ఏళ్ల పాలకులు దేశంలో పేదరికాన్ని అంతం చేస్తామని ప్రకటిస్తూనే ఉన్నారన్నారు. మరోవైపు ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసి ప్రజలను అంతం చేస్తున్నారని వ్యక్తం చేశారు దళిత ఆదివాసి హక్కుల సాధన కోసం పరితపించిన కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు మన్నెం ప్రసాదును 20 ఏళ్ల క్రితం హంతక ముఠా అత్యంత దారుణంగా నరికి చంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 10వ తేదీన ఒంగోలులో జరిగే మన్నం ప్రసాద్ సంస్కరణ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిఎస్ రాయల్, కేఎస్పీఎస్ సభ్యులు తోడేటి శ్రీనివాస్, న్యాయవాది బేతాళ ప్రకాష్ రావు, పాల్గొన్నారు.

ఒంటరి మహిళపై దాడి... దోపిడీ

● మహిళ సహా ముగ్గురు అంతర జిల్లాల దోపిడీ దొంగలు అరెస్ట్

● రూ 13 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టపగలు ఇంటిలో ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలి దాడి చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకున్న ఓ మహిళ సహా ముగ్గురు అంతర జిల్లాల దోపిడీ దొంగల ముఠాను కొల్లిపర పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రస్తుతం గుంటూరు నగరంలోని బొంగరాల బీడులో నివాసం ఉంటున్న పిడుగురాళ్ల లోని లెనిన్ నగర్ ఏడవ లైనుకు చెందిన కుంచపు దుర్గాప్రసాద్, ఆయన భార్య మున్నంగి ప్రియాంక, ప్రస్తుతం నల్లపాడు లో ఉంటున్న పిడుగురాళ్ల లెనిన్ నగర్ ఏడవ లైనుకు చెందిన కొత్తపల్లి ఎలీషా అనే ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 13 లక్షల ఖరీదైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. గత నెల 26న కొల్లిపర పోలీస్‌స్టేషన్ పరిధిలోని అత్తోట గ్రామంలో బొల్లి ముంత బుల్లెమ్మ (78) అనే వృద్ధురాలు ఇంటిలో ఒంటరిగా మధ్యాహ్నం సమయంలో నిద్రిస్తుండగా నిందితులు దుర్గాప్రసాద్, ఎలీషా ద్విచక్ర వాహనంపై గ్రామంలో రెక్కీ నిర్వహించి ఇంట్లోకి వెళ్లి నిద్రిస్తున్న బుల్లెమ్మ పై దాడి చేసి ఆమె ఒంటిపై ఉన్న 160 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకున్నారు. వృద్ధురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొల్లుపర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. అత్తోట గ్రామం తో పాటు సమీప గ్రామాల్లో సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించడంతో పాటు సెల్ టవర్ తదితర సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితులను దుర్గాప్రసాద్ ఎలీషాగా గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. పలు ప్రాంతాల్లో సీసీ కెమెరా ఫుటేజీలతో ఈ కేసును త్వరితగతిన చేదించగలిగామన్నారు. కేవలం 5 రోజుల్లోనే దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసామన్నారు. నిందితుల ఆచూకీ తెలుసుకోవడంలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయించామన్నారు. ఇప్పటికైనా ప్రజలు నివాసాలు, వ్యాపార సముదాయాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. నిందితులపై ఇప్పటి వరకు 21కి పైగా కేసులు నమోదయ్యాయన్నారు. ఈ కేసును తెనాలి డిఎస్పీ జనార్ధన్ రావు పర్యవేక్షణలో తెనాలి రూరల్ సీఐ ఉమేష్, కొల్లిపర ఎస్సై కోటేశ్వరరావు , తెనాలి రూరల్ ఎస్సై ఆనంద్ ,, ఏఎస్సై పోతురాజు, హెడ్ కానిస్టేబుల్ రామ కోటేశ్వరావు, కానిస్టేబుల్స్ రామకృష్ణ, మహిళా కానిస్టేబుల్ హమీమ్ ల బృందంతో కలిసి, కేవలం ఐదు రోజుల్లోనే కేసు చేదించారు. వారికి ఎస్పీ అభినందనలు తెలిపి, ప్రశంసాపత్రాలు అందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన తెనాలి డీఎస్పీ జనార్ధనరావు, సీఐ ఉమేష్, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, పక్కన టీడీపీ నాయకులు

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమ రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తెలిపారు. సోమవారం పెదకాకానిలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అన్ని రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి, వారి జీవన ప్రమాణాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. పీ4 విధానాన్ని అమలు చేసి పేదరికం లేని సమాజం కోసం సీఎం చంద్రబాబు పెద్ద ఎత్తున ప్రణాళికలు రూపొందిస్తున్నారు అని తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 10 చెక్కులను రూ.5,31,104 మొత్తాన్ని పెదకాకాని మండలంలోని లబ్ధిదారులకు పొన్నూరు శాసన సభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అందజేశారు.

అధికారులతో రివ్యూ నిర్వహించిన ఎమ్మెల్యే...

పెదకాకాని మండలం తహసీల్దార్ కార్యాలయంలో, రేషన్ కార్డులు, పట్టాదారు పాసుబుక్, కాలనీ పట్టాలపై స్థానిక అధికారులులతో రివ్యూ నిర్వహించి ప్రజలు నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించాలని కాలనీ ప్రజలకు పట్టాలు రెడీయాలని అధికారాలులకు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ఆదేశించారు.

దేశం గర్వించ దగ్గ నాయకుడు చంద్రబాబు...

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశం గర్వించదగ్గ నాయకుడని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ శనివారం కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసి చంద్రబాబు 30 ఏళలు ఆయన సందర్భంగా అభినందనలు తెలియజేశారు. 75 ఏళ్ల నవ యువకుడు చంద్రబాబు అని కొనియాడారు 47 ఏళ్లగా ప్రజా సేవలో తరిస్తున్న ధన్యుడన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు కంకణ బద్ధుడై తెలుగు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన దార్శినికుడని కొనియాడారు. ప్రజల వద్దకే పాలనకు శ్రీకారం చుట్టిన సంస్కరణల ఆద్యుడని అన్నారు. యువతకు ఆత్మస్థైర్యాన్ని ఇచ్చి రాజకీయాన్ని రాష్ట్ర హితం కోసం అన్వయించిన అపరచాణిక్యుడుగా తెలిపారు. సాంకేతిక విజ్ఞానాన్ని సామాన్యుల కోసం అందుబాటులోకి తెచ్చేలా చేసి నవ్యాంధ్ర ప్రగతికి తొలి బాటలు వేసిన కార్యశూరుడు అన్నారు. చంద్రబాబు లాంటి దేశం గర్వించే నాయకుడి నాయకత్వంలో పనిచేయడం తమకు గర్వకారణంగా చెప్పారు. ఇటు పార్టీ అటు ప్రజలే జీవితంగా అనునిత్యం తపించే చంద్రబాబు కలకాలం విలసిల్లాలని ఆకాంక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు
10 దరఖాస్తులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 01 (ఆంధ్రజ్యోతి) : సోమవారం పట్టణంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 దరఖాస్తులు అందాయి. సబ్ కలెక్టర్ కార్యాలయంలో మెడికల్ 2, రెవెన్యూ, విద్యాశాఖ, పోలీసు, మున్సిపల్, పంచాయితీరాజ్ శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు అధికారులకు అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ శ్రీకాంత్‌కు అర్జీదారులు సమస్యలు తెలిపారు. ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు తొలగించాలని, సర్వే చేయాలని, అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఇవ్వాలని దరఖాస్తులు అందజేశారు.

నేటి యువతకు చంద్రబాబు ఆదర్శం



ప్రధాన ద్వారం వద్ద కేక్ కటింగ్ చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటిసారి ముఖ్యమంత్రిగా నేటికి 30 సంవత్సరాలు ప్రస్థానం అయిన సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సోమవారం ప్రధాన ద్వారం వద్ద టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా టి ఎన్ టి యు సి, టిఎన్ఎస్ఎఫ్ సమన్వయకర్త డాక్టర్ మండూరు వెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేటి యువతకు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అతని యొక్క జీవన ప్రయాణంలో ,రాజకీయ ప్రస్థానంలో ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని తన లక్ష్యని చెదరకుండా ఎదిగిన నాయకుడన్నారు. నేటి యువతకి ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని కోరారు. 75ఏళ్ల నవ యువకుడని తెలుగు కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన ఆయన నాయకత్వాన్ని ఆదర్శంగా తీసుకొని టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థులు ఆయన వెంట ప్రయాణిస్తామని నవ్యాంధ్ర అభివృద్ధిలో టిఎన్ఎస్ఎఫ్ భాగస్వామ్యం అవుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య త్రిమూర్తులు, టిఎన్టియుసి అధ్యక్షుడు వి.విష్ణు ప్రసాద్, రాధాకృష్ణ జి.శ్రీనివాస్, ధనుంజయ్, రాజేంద్ర, డైలీ వేజ్ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ పాల్గొన్నారు.

రూ.రెండు లక్షలు పలికిన లడ్డు

పొన్నూరుటౌన్ , సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో చౌదరి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలోని లడ్డు వేలంపాటలో రెండు లక్షలు ధర పలికింది. ఆదివారం రాత్రి 25 కిలోల లడ్డు వేలంపాటను నిర్వహించారు. గ్రామానికి తాళ్లూరి శ్రీనివాసరావు రూ. 2.02 లక్షలకు రికార్డ్ స్థాయిలో వేలంపాట పడి లడ్డును దక్కించుకున్నారు.

లడ్డూని వేలం పాటలో దక్కించుకున్న శ్రీనివాసరావు →



రోటరీ సేవలు విస్తరింపజేయాలి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సామాజిక ప్రగతికి రోటరీ క్లబ్ సేవలు విస్తరింపజేయాలని క్లబ్ గవర్నర్ ఎస్.వెంకట్రామ్ ప్రసాద్ పేర్కొన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సమావేశం నిర్వహించారు. క్లబ్‌లో చేరిన నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. పవర్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న షేక్ షబీనాకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాతలు చేయూత తీసుకుని సమాజంలో అసమానతలను తొలగించేందుకు కృషి చేయాలన్నారు. ఈదర వెంకటపూర్ణచంద్, నల్లూరి వెంకటేశ్వరరావు, హరిప్రసాద్, వెంకటరత్నం, మురళీకృష్ణ, చేతన్‌రాజ్, డాక్టర్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.


నూతన సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న వెంకట్రామ్ ప్రసాద్